గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జూన్ 2015
# కథలు




ఈ ఉదయం చాలా ఆహ్లాదకరంగా ఉంది. మనస్సు ఆనందంగా ఉంది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ నా బెడ్ రూము కిటికిలోంచి చూసాను. ఏ చిత్రకారుడో ప్రతీ ఆకును విచిత్రమైన రంగులలో ముంచి తరులకు కొత్త అందాలను అద్దినట్లుగా ప్రకృతి వర్ణశోభితంగా కనిపిస్తోంది.. అందాలను తురముకున్న తరులు గాలికి ఊగుతూ ఆకాశానికి శృంగార సంకేతాలు పంపుతున్నట్లుగా ఆకులు గలగల లాడుతున్నాయి.

యాష్ బర్న్ ఎ బ్యూటిఫుల్ ప్లేస్ టు లివ్ ఇన్ వర్జీనియా. సెప్టెంబర్ చివరిలో వచ్చే ఫాల్ సీజన్ నాకెంతో ఇష్టం. అమెరికాలో శరత్కాల ఆగమనం వర్ణరంజితం. రంగురంగులతో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంటుంది. ఏ తరువుచూసినా తనువంతా రంగులను పులుముకున్నట్లు కనువిందు చేస్తాయి. ఐదేళ్ళుగా ఆ వర్ణశోభితం నాకు నిత్యనూతనమే.

నిన్న ఆవిష్కృతమైన ఓ రంగులకల ఘనీభవించిన నా జీవితంలో ఓ శృంగారకావ్యానికి పీఠిక రాసింది. “మరియా అలజంద్ర....అలజంద్ర....”త్యాగరాజు కీర్తన ఆలపించినట్లు పదే పదే స్మరిస్తోంది మనసు.

నిన్నటి సంఘటనతో నా జీవితం మారిపోయినట్లనిపిస్తోంది.......

సాయంత్రం ఆరున్నరయ్యింది, ఆఫీసు నుండి వస్తూ బ్రాంబుల్డన్ ప్లాజాలోకి కారు పోనిచ్చి హారీస్ టీటర్ సూపర్ మార్కెట్ ఎదురుగా పార్క్ చేసి షాపింగ్ చెయ్యడానికి లోపల కెళ్లాను. నాక్కావాల్సినవి కొనుక్కుని బయటకొచ్చేసరికి ఓ అరగంట పట్టింది. అప్పటికే బాగా చీకటి పడింది. కొంచెం చలిగా, మబ్బుగా కూడా ఉంది. సన్నగా వాన మొదలైంది.

వాటే రొమాంటిక్ ఈవెనింగ్. కూల్ బ్రీజ్....ఆ డ్రిజిల్లో తడుస్తూంటే.... ఆ వెట్ ఫీలింగ్...ప్చ్..లోపలలోపల ఎదో....ఎదో.... అదేంటో తెలియడంలేదు.

ఆకలిగా అనిపిస్తోంది. ఇప్పుడు ఇంటికెళ్ళి వంట చేసుకోవాలా ?.....ప్చ్... బోర్.... ఓకే...నో మూడ్ టు కుక్. గుండెల్లో ఎదో గుబులు ఇది అని చెప్పలేని స్థితి.

గాలి బాగా వీస్తోంది. వాన పెద్దదయ్యేలా ఉంది. కారు దగ్గరే నుంచున్నాను. ఏం చెయ్యాలి....? అటూఇటూ చూస్తున్నాను. ఎదురుగా మెక్సికన్ గ్రిల్. లెట్ మి పేక్ సం మెక్సికన్ ఫుడ్. రెస్టారెంట్ వైపుకి కదిలాను.

రెస్టారెంట్ ఖాళీగా ఉంది. వర్కింగ్ డే అవడం మూలానేమో ఇద్దరో ముగ్గురో ఉన్నారు.

“హాయ్!” ఓ మెక్సికన్ అందం నవ్వింది పలకరింపుగా. గుబులుగా నున్న గుండెల్ని ఒక్కసారి కుదిపినట్లయ్యింది. నిగనిగలాడుతున్న శరీర సోయగానికి అలలు అలుగా కదులుతున్న రాగి రంగు జుట్టు, చక్కని కనుబొమ్మలకు జతగా మెరుస్తున్న ఆకుపచ్చని కళ్ళు, సూటైన ముక్కు, దానికి కొంచెం దిగువన పొందికగా కూర్చున్న ఎర్రని పెదవులు, నాజూకైన మెడ, క్రిందగా యవ్వనాల పొంగులు. వాటి మధ్య ఏర్పడిన అగాధాల్లోంచి జారిపోయిన సౌందర్య రేఖలు. దేవుడు అందాన్ని మరేదో లోహంతో కరిగించి పోత పోసినట్లున్న విగ్రహం. వలలో చిక్కుకున్న చేప పిల్లలా నేను....ఆ అందమైన వలలో చిక్కుకున్నాను.

అసలు ఆడపిల్లల్ని ఎప్పుడూ చూడనట్లు నా దృష్టంతా ఆమె పైనే. ఎంత అందంగా ఉన్నాయ్ ఆ కళ్ళు... హరితవనాల్లా.....ఆకళ్ళలో ఆడుకోవాలనే కోరిక....ఎదో మైకం..... తన్మయత్వం..... ఆ అందాన్ని ఆరాధిస్తూ ఉండిపోయాను.

విచ్చుకున్న ఎర్ర గులాబీల్లా ఆ పెదాలు విడివడి మళ్ళీ హాయ్ మనేసరికి తత్తరపడి వాస్తవంలోకి వచ్చాను. "హాయ్....ఎక్స్ క్యూజ్ మి....యు ఆర్ ....?" ప్రశ్నార్ధకంగా చూసాను.

నా తాపత్రయాన్ని అర్ధం చేసుకుని " మరియా...మరియా అలజంద్ర..." ఆ స్వరంలో తీయదనం తేనె చిలకరించినట్లు.

"ఓహ్! థాంక్స్ .." ఆనందంతో తబ్బిబ్బవుతూ, "మిస్ మరియా! యూ ఆర్ సో లవ్లీ...." అప్రయత్నంగా అనేసిన నన్ను వింతగా చూసింది, మరింత అందంగానూ నవ్వింది. అంత ధైర్యం నాకెలా వచ్చిందో తెలియలేదు. మరియాతో నా సంభాషణ ఇక్కడితో ఆగిపోకుండావుంటే బావుంటుందనిపించింది. కానీ నాకివన్నీ మామూలే అన్నట్లుగా చూసి "థాంక్ యూ...! వాట్ డు యు లైక్ టు ఆర్డర్". అంది.

"ఒన్ బరిటో...నాట్ విత్ టార్టిల్లా బట్ ఎ బౌల్ విత్ బ్రోకొల్లి, కార్న్, బ్లాక్ బీన్స్ అండ్ జలపెనో సలాడ్, అఫోర్సు విత్ లాట్ అఫ్ చీజ్ ప్లీజ్..." పేక్ చేసుకుని వెళ్దామన్న నా ఆలోచనను విరమించుకుని అక్కడే తినడానికి ఆర్డర్ ఇచ్చాను.

"ఓకే.." అని నా ఆర్డర్ తీసుకుని అయిదు నిమిషాలలో బరిటో బౌల్ నాకందించింది. మరియా కనిపించేలా ఓ టేబుల్ దగ్గర కూర్చుని మెక్సికన్ బరిటోతో పాటు మెక్సికన్ అందాన్ని అరగంటసేపు ఆస్వాదించాను. కోక్ తో బాటు మరియా ముగ్ధమోహన సౌందర్యాన్ని జుర్రుకుంటున్నాను. ఆమె స్నేహం కోసం మనసు ఆరాటపడ్తోంది. విచిత్రమైన మానసిక స్థితి. ఓ సారి చుట్టుపక్కల చూసాను. రెస్టారెంట్లో ఇప్పుడెవరు లేరు నేను తప్ప. నవ్వుతూ టేబుల్ దగ్గరకొచ్చింది.

టైట్ బ్లాక్ ఫెడేడ్ జీన్స్ లో ఆమె వంపుసొంపులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యెల్లో టీ షర్ట్ ఉరుకుతున్న ఆమె యవ్వనాలని అదిమి పెట్టలేక ఎప్పుడు చిరిగిపోతుందా అన్నట్లుంది. ఆమె నడుం సన్నగా ఆ బరువులు మోయలేనట్లుగా ఉంది. నా గుండె లయ తప్పుతోంది. బయటకు రమ్మన్నట్లుగా సంజ్ఞ చేస్తే మంత్రముగ్దుడనై వెనకాలే వస్తున్న నన్ను చూసి కొంటెగా నవ్వింది. చల్లని తెమ్మెర తాకినట్లై శరీరం కంపించింది. బయట గాలి ఎక్కువగా ఉంది. వర్షం కురుస్తోంది.

కారిడార్ లోకి రాగానే సిగరెట్ కాల్చాలని పించింది. లైటర్తో వెలిగించబోయాను. చేతుల్లో సన్నని వణుకు. గుండె వేగంగా కొట్టుకోవడం చెవుల్లో వినిపిస్తోంది. గాలికి మంట ఆరిపోతోంటే తన చేతులు నా చేతులుపై వేసి అడ్డుపెట్టింది. ఆ స్పర్శకి శరీరం చల్లబడి, మంచుపూల సెగ గుండెలను సూటిగా తాకినట్లైంది. ఏంటో తెలియని పరిస్థితి. నన్నూ, నా అవస్థను గమనిస్తూ మెల్లిగా సంభాషణ మొదలెట్టింది.

“మీరు చాలా ఎక్సైటెడ్ గా కనిపిస్తున్నారు, కారణం తెలుసుకోవచ్చా?      మీ పేరు….??”

“ఓహ్! సారీ…. ఐ యాం శిరీష్, ఇండియన్….స్టెర్లింగ్ లో ఉద్యోగం, బ్రాంబుల్డన్ యాష్ బర్న్ లో నివాసం, ఒక్కడ్నే ఉంటున్నాను…..” తడబాటుతోనే చెయ్యి ముందుకు చాపాను. సంభాషణ ఇంగ్లీష్ లో జరుగుతోంది.

ఆమె అందించిన చేతిని అపురూపంగా, సున్నితంగా స్పర్శించాను. రోలర్ కోష్టర్ రైడ్…. గాలిలో తేలిపోతున్నాను.

ఎంతమంది అమ్మాయిలతో చేతులు కలిపినా నేనెప్పుడూ ఇలా ఫీలవ్వలేదు. ఈ అనుభవం ఎంతో అందంగానూ, మధురంగానూ వుంది.

“ఎక్సైటెడ్…యెస్ ….వెరీ మచ్….బికాజ్ ఆఫ్ యూ!! నిజం… నీ అందం నన్ను బాగా డిస్టర్బ్ చేసింది. నువ్వు చాలా అందంగా ఉన్నావు, ముఖ్యంగా నవ్వుతోంటే. నీ ఆకుపచ్చ కళ్ళు నన్ను కలవర పెట్టాయి. అయిదేళ్ళ నుంచి అమెరికాలో ఉంటున్నాను, ఇంతవరకు నన్నే అమ్మాయి ఇలా కదిలించలేదు. ఐ యాం మ్యాడ్ ఆఫ్ యు…”

స్వతహాగా ముభావిని నేను, ఎవరితో ఎక్కువగా మాట్లాడను. అందుకేనేమో నాకు స్నేహితులు తక్కువ. కాని ఈ రోజెందుకో నా ప్రవర్తన నాకే వింతగా ఉంది. కంట్రోల్ చేసుకోలేక పోతున్నా, మాటలు ప్రవాహంలా వచ్చేసాయి.

“ఐ యాం సారి. ఆర్ యూ ఓకే…?….నన్నిదివరకు ఎప్పుడైనా చూసావా?….నాకు మాత్రం నిన్నెపుడూ కలసినట్లు గుర్తు లేదు. నువ్వెప్పుడూ ఆడపిల్లల్ని చూడలేదా? మాట్లాడలేదా? అంత ఎక్సైట్ అవ్వాల్సిన మేటర్ ఏముంది నా దగ్గర?…అసలు నా గురించి నీకేం తెల్సు? నిన్నెలా అర్ధం చేసుకోవాలో తెలీడంలేదు. మీ మగవాళ్ళు ఆడపిల్లలతో ఇలా ఎందుకు ప్రవర్తిస్తారు? ఆడపిల్లల విషయంలో ప్రపంచంలో మగవాళ్ళంతా ఒక్కలాగే ఉంటారా?….

ఆమె మాటలకి ఒక్కసారిగా షాక్ తిన్నాను. ఆమె నన్ను సరిగ్గా అర్ధం చేసుకోలేదు. నాలో కల్గిన భావావేశాల్ని బయట పెట్టానే తప్ప, అంతకన్నా నేనేం చేశాను? ఈ దేశంలో, ఈ కాలంలో ఇలాంటి ఆడపిల్లలున్నారా? ఓహ్…నన్ను నేను ఎందుకు కంట్రోల్ చేసుకోలేకపోయాను?

ఇప్పుడు నా చేష్టిటిని ప్రూవ్ చేసుకోవాలా?.... ఎ థింగ్ అఫ్ బ్యూటీ ఈజ్ జాయ్ ఫరెవర్....నా భావన తప్పా?.... అవమానభారం నన్ను దోళనకు గురిచేసింది.

“ప్లీజ్ మరియా..ప్లీజ్. యు ఆర్ టోటల్లీ మిస్టేకన్ మి. నిన్ను చూసిన వెంటనే ఎలాంటి ఫీలింగ్స్ కలిగాయో చెప్పాను. అది తప్పని, అలా చెప్పకూడదని నాకు తెలీదు. నీమీద నాకెలాంటి దురాలోచన లేదని ఎలా చెప్తే నీకర్థం అవుతుంది? ఐ యాం సారీ. నేనిక్కడికి రావడం, నిన్నిలా కలుసుకోవడం యాదృచ్ఛికం. నా ప్రవర్తన నీకు బాధ కలిగిస్తుందని ఊహించని నేను ఇలా జరగకుండా ఉంటే బావుండేది అనుకుంటున్నాను. నిన్ను బాధ పెడ్తే క్షమించు.

ఐ యాం సెంటిమెంటల్ ...లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ఈజ్ ట్రూ ఆర్ నాట్ ఐ డోంట్ నో... కానీ... ఒక్కటి మాత్రం నిజం.. యు అర్ ఆల్రెడీ హియర్....ఇన్ మై హార్ట్... నిన్నెప్పుడూ మర్చిపోలేను .....” వెళ్ళిపోడానికి ఉద్యుక్తుడైన నన్ను చెయ్యి పట్టుకుని ఆపింది.

“షిరిస్....బ్రతుకు తెరువు కోసం ఓ చిన్న ఉద్యోగం చేసుకుంటున్న ఇరవై ఏళ్ల ఆడపిల్లని. ఇటువంటి అసాధారణ పరిస్థితుల్లో ఇంకోలా మాట్లాడడం నాకెవ్వరూ నేర్పలేదు. ఇందులో నేను బాధ పడడానికి, నువ్వు

సంజాయిషీ ఇవ్వడానికి ఏమీలేదు. రోజూ ఎంతోమంది ఈ రెస్టారెంట్ కి వస్తుంటారు. వాళ్ళకి రకరకాల రుచులు, అబిరుచులు.... నేను కేవలం వాళ్ళకి సహాయపడతాను, సర్వ్ చేస్తాను తప్ప వేరే ఆలోచనలుండవు. నాకున్నది ఒకటే ఆలోచన, ఒకటే గమ్యం, తండ్రి విడిచి వెళ్ళిపోయిన నా కుటుంబానికి ఆసరాగా ఉండడమే. బట్....” మాట్లాడడం ఆపి చీకట్లో కురుస్తున్న వర్షంకేసి, ఆకాశంకేసి చూస్తూ కళ్ళు మూసుకుంది.

ఇంకా నా చేయి ఆమె చేతిలోనే ఉంది. గట్టిగా పట్టి ఉన్న పిడికిల్లోంచి వెచ్చటి ఆవిర్లు. కళ్ళు తెరిచి నాకేసి చూసింది, ఆమె కళ్ళలో పల్చటి నీటిపొర.

“బట్....తల దించి క్రిందికి చూస్తూ మెత్తటి స్వరంతో, “మనసులో భావాలూ నిర్భయంగా చెప్పిన నీ వ్యక్తిత్వం, నీ మాట, ప్రవర్తన నన్ను ఆకట్టుకున్నాయి. నిన్ను ఎప్పుడూ మర్చిపోలేనన్నావు కదా!.... ఆ మాట ఒక్కటి చాలు ఒక ఆడపిల్ల హృదయాన్ని కదిలించడానికి. నీ స్నేహం నాకు కావాలి షిరిస్. నన్ను ఓ స్నేహితురాలిగా అంగీకరిస్తావా?.....”ఉద్వేగంగా అనిపించాయి ఆ మాటలు.

అప్పటివరకూ కురుస్తున్న వాన ఆగిపోయింది. హృదయాలు తేలికపడి చిరునవ్వుల జల్లులుకురిసాయి. రెండు మనసులు స్నేహంకోసం ఆరాటపడుతున్న క్షణాలు.... స్నేహంగా ఆమె చేతులను స్పృశించాను.

"థాంక్స్ షిరిస్...థాంక్స్ మై ఫ్రెండ్....ఈ రాత్రి విరిసిన స్నేహ పుష్పాలు మరింత విచ్చుకుని పరిమళాలను వెదజల్లుతూ గాఢమైన మైత్రీ బంధనంగా నిలిచిపోవాలని ఆశిస్తాను. థాంక్యూ ఎగైన్ షిరిస్... మనం కల్సుకుంటూ ఉందాం. ప్రస్తుతానికి...బై...టేక్ కేర్...." మరొక్కసారి నా చేయి గట్టిగా నొక్కి వెళ్ళిపోయింది. ఓ రంగులకల ఆవిష్కృతమైంది.

నన్ను నేనే నమ్మలేకపోతున్నా. ఆ దృశ్యం వాస్తవమే అయినా ఓ అందమైన ఊహలా గోచరించింది. కొద్ది క్షణాల పరిచయం స్నేహానికి దారి తీసిందన్నది వాస్తవమైతే ఆ అందమైన అనుభవం ఊహాతీతం. సంతోష తరంగాలు హృదయాన్ని తాకుతోంటే సంభాళించుకుని తేలికైన మనసుతో ఇంటి ముఖం పట్టాను.

ఆ తర్వాత మేం చాలా మాట్లాడుకునేవాళ్ళం. పగలు, రాత్రి అనేది లేకుండా ఫోన్లలోనే కాలం గడ్చిపోయేది. కలుసుకున్న ప్రతి క్షణం, మాట్లాడుకున్న ప్రతి మాట కొన్ని ఆనందపు అధ్యాయాలకు ప్రాణం పోశాయి.

ఇంచుమించు ప్రతి సాయంత్రం మరియాని కల్సుకోడం దినచర్యగా మారింది. ఆమె సన్నిధిలో సాయంత్రాలన్ని అందంగా వుండి, ఏంటో చాలా తొందరగా గడిచిపోయేవి. శనాదివారాలు ఎక్కడెక్కడికో తిరిగేవాళ్ళం. ఎన్నో కబుర్లు చెప్పుకునే వాళ్ళం. నాకు జ్ఞానం వచ్చిన తర్వాత నేనన్ని మాటలు మాట్లాడి ఎరుగను. మరియా ప్రతి చర్య, ప్రతి మాట నాకెంతో ఆనందాన్ని కలిగించేవి. కారులో అనంతంగా సాగే ప్రయాణాలు మా మధ్య దూరాన్ని కరిగిస్తే, మెత్తని పచ్చికలతో వర్జీనియా మైదానాలు మాకెప్పుడూ స్వాగతం పలుకుతుండేవి.

ఒకసారి షనండోవా నేషనల్ పార్క్ ప్రయాణం పెట్టుకున్నాం. ఒకరితర్వాత ఒకరు డ్రైవ్ చేసుకుంటూ ప్రకృతి అందాలకు మైమరచిపోతో కాలం వేగానికి కళ్ళెం వేయలేక కారు వేగాన్ని తగ్గించుకుంటూ పోతున్నాం.

పచ్చటి సూర్యకాంతి రంగురంగుల ఆకులపై పడి వింతగా మెరుస్తున్న వృక్షాలు. దూరంగా నల్లటి కొండలు. కారు ఆపి ఆ మైదానంలోకి నడిచాము.

అప్పటివరకు చెప్పుకున్న కబుర్లు ఆగిపోయాయి. కాసేపు మౌనం. మనసులు కలిసిన మేము మౌనరాగాలు పంచుకున్నాం, భావాలు పంచుకున్నాం, అనురాగాలు పంచుకున్నాం. ఒకళ్లగురించి ఒకళ్ళు పూర్తిగా తెల్సుకున్నాం. కాని భౌతికంగా ఇంకా మేమిద్దరం ఒకటికాదన్న నిజం అబద్ధంగా మారడానికి కారణాలు వెతుక్కుంటోంది.

చలిగాలి రోద పెడ్తోంది. ఇద్దరి మనస్సుల్లో ఎదో తెలియని ఆందోళన. ఒక మధురమైన అవకాశం ఆశగా ఎదురుచూస్తోందని పించింది నాకు.అసంకల్పితంగా పక్కనున్న మరియాను ఒక్కసారిగా పొదివి పట్టుకున్నాను. లతలా నన్ను పెనవేసుకుపోయింది. ఆర్తిగా ఆమె కన్నులు మూసుకున్నాయి. ఎర్రని పెదవులు విచ్చుకున్నాయి. విచ్చుకున్న ఆ గులాబీలను మృదువుగా చుంబించాను. మొదటి చుంబనం నన్ను గగనం అంచులదాకా తీసుకెళ్ళింది. ఓ విద్యుల్లత అణువణువునా ప్రాకింది. కౌగిలి మరింత బిగిసింది. ఒక మేఘం మెరుపుతో సంగమించినట్లు, ఓ కెరటం ఆర్తిగా తీరాన్ని తాకినట్లు, దూరంగా ఆకాశం అవనితో పరిష్వంగించినట్లు. పచ్చటి ఆ మైదానంలో గాలి పూర్తిగా స్తంభించింది. అలసిపోయి దీర్ఘంగా వస్తున్న ఉచ్వాశ,నిశ్వాసలు అదుపుచేసుకోలేక వెల్లకిల్లా పడుకుని ఆకాశంకేసి చూస్తూ అలౌకికానందాన్ని అనుభవించాము. కాలం ఘనీభవించి అలా ఉండిపోతే బావుంటుందని అనుకున్నా ఆ క్షణంలో.

ఇక మా మధ్య దాపరికంలేదు. జీవితంలో కొన్ని మధుర సంఘటనలకు వాస్తవాన్ని జతచేయాలి. నేను అమ్మానాన్నలతో, తను తన కుటుంబ సభ్యులతో చర్చించి పెళ్ళనే బంధంతో ఒకటిగా అవ్వాలని ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాం.

ఎండలో మంచుముక్కలా కాలం కరిగిపోతోంది. ఆకులతో ఆడుకుంటున్న గాలికెరటాల వేగంతో పోటీ పడుతూ రోజులు గడిచిపోతున్నాయి. కొన్ని అనుభవంలోకి వస్తేగాని తెలిదంటారు. నెలరోజుల పరిచయంలో ఎంత దగ్గరయ్యామో ఇప్పుడు తెలుస్తోంది.

ప్రాజెక్ట్ పనిమీద నాలుగు రోజులు శాన్ ఫ్రాన్సిస్కో వెళ్ళాను. వెళ్లేముందు ఆ విషయం మరియాకు చెప్పడం కుదరల్లేదు. మొదటి రెండు రోజులు పని వత్తిడి వల్ల ఫోన్ చెయ్యలేక పోయాను. తర్వాత రెండురోజులు ఎంత ప్రయత్నించినా మరియా ఫోన్ అన్సర్ చెయ్యలేదు. ఏమైందో ఏమిటో? ఎప్పుడెప్పుడు మరియాను కలుద్దామా అన్న ఆత్రంతో యాష్ బర్న్ బయల్దేరాను.

ఎయిర్ పోర్ట్ నుంచి ఇంటికొచ్చేసరికి ఆలస్యం అయ్యింది. గబగబా ఫ్రెషయ్యి కారులో బయల్దేరాను. అప్పుడు చూసాను. మా కమ్యూనిటీలో డెకరేటెడ్ హౌసెస్. రంగురంగుల దీపాలతో మెరిసిపోతున్నాయి.,

ఇంటిముందు దొలచిన గుమ్మడికాయలు, విచిత్ర వేషాలతో పిల్లలు ఇంటింటికి ట్రిక్ ఆర్ ట్రీట్ అంటూ తిరుగుతున్నారు.

ఓహ్! ఈరోజు హాలోవీన్ డే.

మరియా రెస్టారెంట్ ఉంటుందో ఉండదో?.... ఎలాగైనా మరియాని కలవాలి. నాకు తెల్సు తను నాకోసం ఎదురుచుస్తో ఉంటుంది. హాలోవీన్ ట్రీట్ ఇవ్వాలి....

అక్టోబర్ 31 హాలోవీన్ డే. హాలో అంటే స్కాటిష్ లో పవిత్రమైన అని అర్థం. ఇర్లాండ్,స్కాట్లాండ్ గ్రామాల్లో పంటల కాలం ముగిసిన తర్వాత, శీతాకాలం ప్రారంభంలో చనిపోయిన వారి ఆత్మలు తిరిగి ఒకరోజున తమ నివాసాలకు వస్తాయని ప్రజల నమ్మకం. ఆ రోజున హాలోవీన్ డే గా సెలబ్రేట్ చేసుకుంటారు. ఆ ఆత్మలకోసం డిన్నర్ టేబుల్ ఏర్పాటుచేసి వారిని తలుచుకుని వారికోసం పాన్ కేకులు, క్యారెట్లు, కొన్ని ధాన్యాలు సమర్పిస్తారు. ఒకప్పుడు యూరప్ లో మాత్రమే జరుపుకునే హాలోవీన్ రోజు, తర్వాత అమెరికాకు కూడా ప్రాకింది. ఈరోజు గుమ్మడికాయలను విచిత్రమైన ఆకృతులతో దొలిచి లైట్లు పెట్టి ప్రతి ఇంటిముందు అలంకారంగా పెడ్తారు.ఎవ్వరికి హాని చెయ్యకుండా ఆత్మలు వాటి దారిని వెళ్ళేలా ఇలా దీపాలను పెట్టడం ఒక ఆచారంగా వస్తోంది. పెద్దలు,పిల్లలనే తేడ లేకుండా సైతాను, డెవిల్, ఇంకా మరెన్నో భయంగొలిపే విచిత్రమైన వేషాలు వేసుకుని పార్టీ చేసుకుంటారు. పిల్లలు ఇంటింటికి వికృత వేషాలతో తిరుగుతూ ట్రిక్ ఆర్ ట్రీట్ అంటో చాకోలేట్స్, లేదా డబ్బులు తీసుకుంటారు. ఆరోజంతా పండగ వాతావరణం నెలకుంటుంది.

ప్లాజాలో షాప్స్ అన్ని మూసేసారు. కారు పార్క్ చేసి పరుగులాంటి నడకతో రెస్టారెంట్ చేరాను.

కారిడారులో చీకట్లో అస్పష్టంగా ఓ రూపం. మరియా..... మరియాయే.....కాకపోతే ఈ సమయంలో అక్కడ వేరేవాళ్ళు ఎందుకుంటారు?

నా ఊహ నిజమే! తెల్లని దుస్తుల్లో మరియా వెన్నెల్లో మల్లెపువ్వులా ఉంది. ఆత్రంగా ఆమెను చేరుకున్నాను. మరియా అంటో ఆమెను చేరబోయాను. నన్ను చూసి బెదురుగా వెనక్కి అడుగేసింది.

“మరియా! నిన్ను చూడాలని నా మనస్సెంత తహతహలాడుతోందో తెల్సా? ప్రాజెక్ట్ పని వత్తిడిలో ఫోన్ చెయ్యడం కుదర్లేదు. తర్వాత రెండు రోజులు నీ ఫోన్ కోసం నిమిషనిమిషానికి ప్రయత్నించాను. కానీ నువ్వు ఫోన్ ఎత్త లేదు? నా మీద కోపమా? నీకు చెప్పకుండా వెళ్ళాననేగా? ఐ యాం సారీ డియర్.” నా మాటలు విందో లేదో తెలిడంలేదు. హరితవనల్లాంటి ఆ కళ్ళల్లో బెదురు.

అందీఅందనంత దూరంలో నిల్చుంది. చలాకీగా, ముద్దుగా ఉండే ఆ రూపం దైన్యంగా నిస్తేజంగా ఉంది.

“ట్రిక్ ఆర్ ట్రీట్ ?... హాలోవీన్ డే స్పెషల్ ట్రీట్ ఇవ్వవా? ఈరోజు నువ్వు నాకు ట్రీట్ ఇస్తున్నావు.... లేదంటే నేనే నీకు ఇస్తాను. స్వీట్ ట్రీట్....ఓకే....మరియా డార్లింగ్ ....ప్లీజ్ మాట్లాడు.... ఒక్కసారి దగ్గరగా రా.... ఈ నాల్గు రోజులు నేనెంత నరకం అనుభవించానో నీకు చెప్దామని వస్తే నువ్వు మాట్లాడకుండా, దూరంగా నిలబడి నన్నింకా వేధిస్తున్నావు. సారీ చెప్పానుగా. అయినా ఇంకా కోపం తగ్గకపోతే ఎలాగమ్మా? ప్లీజ్.... మరియా.....ఈ నాల్గురోజులు నాలుగు యుగాలుగా గడిచింది. ఎప్పుడెప్పుడు నిన్ను చేరి, నీ సాంగత్యంలో

ఈ నాల్గు రోజుల విరహాన్ని మరిచిపోవాలని వచ్చాను.... నన్నింక పరీక్షించకు. ఒకసారి దగ్గరగా రా.... మరియా ....ప్లీజ్.” ఒకడుగు ముందుకేశా.

ఆశ్చర్యంగా నా నుండి దూరంగా జరిగింది. అందమైన ఆమె ముఖంలో బెరుకు...కాదు....దైన్యం.....కళ్ళు ఎర్రగాఉన్నాయి. మరియా ఏడుస్తోంది. దగ్గరకు రావద్దన్నట్లుగా చేయూపుతూ, నాకందకుండా పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయింది. ఏమిటది? ఎందుకలా ప్రవర్తిస్తోంది నాకేం అర్థం కావడంలేదు. నిశ్చేష్టుడునై అలా ఎంతసేపున్నానో తెలిదు.

“హే గాయ్! హు ఆర్ యూ?వాట్ ఆర్ యు డుయింగ్ హియర్?..”సెక్యూరిటి ప్రశ్నతో ఈ లోకంలో కొచ్చాను.

“సారీ! లుకింగ్ ఫర్ ఎ ఫ్రెండ్....” కారు దగ్గర కొచ్చి చుట్టూ చుసాను మరియా కనబడుతుందేమోనని....దూరంగా కార్లు వెళ్తున్న శబ్దం తప్ప ఎక్కడా మనిషి జాడ లేదు.

ట్రాన్స్ లో ఉన్నట్లుంది. తల పగిలిపోతోంది. ఎలా ఇంటికి చేరానో నాకు తెలిదు. మరియా ఫోన్ ప్రయత్నించా, జవాబులేదు. రాత్రి కాళ రాత్రయ్యింది..

మర్నాడు అన్యమనస్కంగానే ఆఫీస్ కెళ్లాను. ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారుచేయడంలో కొన్ని రోజులు బిజీగా గడిచిపోయాయి. ఖాళీ దొరికితే చాలు మరియా ఫోన్ ట్రై చేస్తూనే ఉన్నాను. కాని నా దురదృష్టమో ఏమో ఎన్నిసార్లు ప్రయత్నించినా జవాబులేదు.

సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ రెస్టారెంట్ కెళ్ళాను. మరియా కోసం నా కళ్ళు నాలుగు వైపులా చూస్తున్నాయి. మనస్సు ఆత్రంగా ఎదురు చూస్తోంది. నా ఆశలు అడియాశలయ్యాయి. ఎక్కడా మరియా కనిపించలేదు.

“హాయ్! ఐ యాం శిరీష్.....” మేనేజరుకి నన్ను పరిచయం చేసుకుని నే నొచ్చిన విషయం చెప్పాను.

నాకేసి వింతగా చూసాడు సాల్ గోమేజ్ రెస్టారెంట్ మేనేజర్. కాసేపు మౌనంగా వుండి, “నాకు తెల్సు.మరియా మీతో డేటింగ్ చేస్తోందన్న విషయం. కానీ ఐ యాం సారీ..... మీకంతా తెల్సనుకున్నా.....”

“ప్లీజ్ నాకేం తెలిదు. త్వరగా చెప్పండి. ఏమైంది. మరియా ఎక్కడుంది....”ఆలశ్యాన్ని భరించలేకపోతున్నా.

“మీ గురించి చెప్పింది. మీ ఫోన్ కోసం ఎదురు చూస్తున్నా అంది. ఈ రోజు మీ దగ్గర్నుంచి తప్పకుండా వస్తుంది అనుకుంటూ ఎంతో ఉత్సాహంగా వెళ్ళింది. హాలోవీన్ డే మీతో కల్సి సెలబ్రేట్ చేసుకోవాలనుకుంది. బట్.....గాడ్ వాజ్ నాట్ కైండ్ ఆన్ హర్. 29 అక్టోబర్ రాత్రి.... కార్ ఏక్సిడెంట్.... షి వజ్ నో మోర్......” నెత్తిమీద పిడుగు. భరించలేని ధ్వని. తల బ్రద్దలవతోంది.

ఓ గాడ్!!!... అవుతే హాలోవీన్ డే రాత్రి మరియా ఆత్మ నాకోసం ....హే భగవాన్.... నా మరియా....లేదా...?

కళ్ళు తిరుగుతున్నాయి, స్పృహ తప్పింది.

***

బెడ్ మించి లేవాలనిపించడం లేదు. శూన్యంగా వుంది జీవితం. కిటికీ లోంచి చూసాను. మోడులైన చెట్లు ఒంటరిగా, నిర్జీవంగా... ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదని చెప్పడానికేమో శరత్కాల రంగుల హరివిల్లులకు శిశిరం సోకింది రంగులు వెలసిపోయి మోడులై పోయాయి.

నా రంగులకల...... చెదిరిపోయింది......




ఎడ్లబండి పల్లంలోకి వచ్చింది. ఒక్కసారిగా జోడెద్దులు జోరందుకున్నాయి. దాంతో పట్టుతప్పిన కావేరి వెనక్కి తూలింది. రామచంద్ర పట్టుకోనట్లయితే కింద పడిపోయేదే. "అమ్మో" అంటూ రామచంద్ర గుండెల మీద తలవాల్చి అతన్ని గట్టిగా పట్టేసుకుంది.

అబ్బాయిని గట్టిగా పట్టుకొని కూర్చో అమ్మాయ్" అన్చెప్పింది రామచంద్ర తల్లి రత్నాంబ. సిగ్గుపడింది కావేరి. సరిగా కూర్చొని, పక్కనే ఉన్న కర్రను పట్టుకుంది. బండిలో కూర్చొని ఉన్న మిగతా ఆడాళ్లు ఆ జంటను చూసి ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

ఆ బండే కాదు, ఎన్నో బళ్లు వరుసగా ఒకదాని తర్వాత ఒకటిగా పోతున్నాయి, నాగార్పమ్మ శిడి ఉత్సవాన్ని చూడ్డానికి. నాగార్పమ్మ (నాగవరపమ్మ) అంటే గ్రామ దేవత. రైలుకట్ట మీదుగా కొత్త కాల్వ బ్రిడ్జి దాటి జీడిమామిడి తోటల మధ్య నుంచి ఇసుకలో పోతే అల్లంత దూరంలో మామిడి తోటల మధ్య కొలువు తీరిన నాగార్పమ్మ గుడికెళ్లాలంటే సొన దాటుకుని పోవాలి. ఎంత

ఎండాకాలమైనా నీళ్లుండటం ఆ సొన విశేషం. ఎడ్ల బళ్లు సొన అవతల ఆగిపోయాయి. బళ్లు తోలేవాళ్లు బళ్లనీ, ఎద్దుల్నీ అక్కడి మామిడి చెట్లకి కట్టేసి, ఎద్దుల ముందు గడ్డిమోపులు పడేస్తున్నారు.

మగాళ్లు ఫ్యాంట్లు, ఆడాళ్లు చీరలు మోకాళ్ల దాకా ఎత్తి పట్టుకుని సొనలో దిగారు. చీరెత్తి పట్టుకోవాలంటే ఎక్కడ లేని సిగ్గూ, బిడియం ఆవరించాయి కావేరిని. "నా వల్ల కాదు" అంది చిన్నగా రామచంద్రతో.

"అయితే చేతుల్లో ఎత్తుకొని తీసుకెళ్లేదా?" అన్నాడు సరదాగా కన్నుగీటుతా.

"ష్" అంటూ కళ్లతో కాస్త కోపాన్ని అభినయించి, చీర కుచ్చిళ్లు కాస్త ఎత్తి పట్టుకుని నీళ్లలోకి దిగింది. చల్లగా తగిలాయి నీళ్లు. ఆమె చేయి పట్టుకొని, చిన్నగా నడిపిస్తూ ఇవతలకి తీసుకు వచ్చాడు రామచంద్ర.

"అబ్బా" అంది కావేరి.

"ఏంటి?" కంగారుగా అడిగాడు.

"కాలిమీద ఏదో కుట్టింది."

ఏదో అర్థమైనట్లు ఆమెను అక్కడే ఉన్న బండరాయి మీద కూర్చోబెట్టి, ఆమె కాలిని చేతుల్లోకి తీసుకుని చూశాడు. పిక్కమీద నల్లగా జలగ! గట్టిగా లాగేసి, టక్కున నీళ్లలోకి విసిరేశాడు. అప్పటికే అది నెత్తురు తాగిన దానికి గుర్తుగా ఎర్రటి చార.

"ఏంటది?" అడిగింది.

"అది జలగ. సిటీ అమ్మాయివి కదా, ఇప్పటి దాకా చూసుండవు. అవునా" అన్నాడు. అవునన్నట్లు తలూపింది.

"ఏం కాదుగా?" అడిగింది, కాలివంక చూసుకుంటూ.

"ఏం కాదు. నేనున్నానుగా" ధైర్యం చెప్పాడు.

గుడివద్ద గోలగోలగా అరుపులూ, "నాగార్పమ్మకీ జై" అన్న కేకలూ వినిపించాయి.

"రా.. రా…" అంటూ అమెను అటు తీసుకుపోయాడు.

శిడిమానును పైకి లేపుతున్నారు. పెద్ద దూలానికి చివర బోను, ఆ బోనులో మేక. దూలాన్ని పూర్తిగా పైకిలేపారు. పూజారి ఏవో మంత్రాలు చదివి, "కానీయండి" అనగానే అక్కడున్న జనం చేతుల్లోని పూలు, అరటిపళ్లు పైకి విసిరి వేస్తున్నారు. వాటిలో కొన్ని బోనుకీ, దాని లోపల ఉన్న మేకకీ తగులుతున్నాయి.

రామచంద్ర, కావేరి కూడా పూలు విసిరారు.

"భలే ఉంది ఈ ఆచారం. ఆ మేకనే చేస్తారు?" అడిగింది కావేరి.

"అమ్మవారికి బలిస్తారు. అలా చేస్తే ఊళ్లో బాగా వానలు పడతాయనీ, కరువు కాటకాలు ఉండవనీ జనం నమ్మకం" చెప్పాడు.

"అయ్యో పాపం మేక" అంది జాలిగా.

"ఇప్పుడు నయం. దాని మీదకు పూలు విసిరేస్తున్నారు. ఒకప్పుడైతే టెంకాయలు విసిరేసేవాళ్లు. అవి తగిలి ఆ మేక ఎంత నరకం అనుభవించేదో."

"మరి టెంకాయల బదులు పూలెందుకేస్తున్నారు?"

"దానికో చిన్న కథుంది. వింటానంటే చెబుతా."

"సరే"

వాళ్లమ్మకు చెప్పి కావేరిని గుడి వెనకున్న మామిడి తోటలోకి తీసుకుపోయాడు రామచంద్ర. ఒక చెట్టుకింద శుభ్రం చేసుకుని కూర్చున్నారు.

"ఇంత ఎండలోనూ ఎంత హాయిగా ఉందిక్కడ. ఇలాంటి చోట ఇల్లు కట్టుకొని ఉంటే ఇంకెంత బావుంటుందో" అంది కావేరి, అతడి భుజం మీద తలవాల్చి.

"అమ్మాయిలో భావుకత్వం ఉబుకుతుందే" అన్నాడు, గాలికి ముఖం మీద పడుతున్న ఆమె ముంగురుల్ని సరిచేస్తూ.

"సరే సరే. ఇందాకటి కథ చెప్పు" అంది, అతడి చేతిమీద గీతలూ గీస్తూ.

గొంతు సవరించుకున్నాడు రామచంద్ర. "దాదాపు ఇరవై ఏడేళ్ల కింద జరిగిన కథ.. కాదు సంఘటన ఇది.." అంటూ మొదలు పెట్టాడు.

*     *     *

పదేళ్ల కొడుకు చిన్నాని వెంటబెట్టుకుని వెళ్లాడు మల్లయ్య, నాగార్పమ్మ శిడి ఉత్సవానికి. శిడిమాను తిప్పడానికి కొంత సమయం పడుతుందని తెలిసి గుడెనక ఉన్న తమలపాకుల తోటలోకెళ్లారు తండ్రీ కొడుకులు.

వాళ్లమాదిరే కొంతమంది ఆ తోటలో తిరుగుతూ కాలక్షేపం చేస్తుంటే, ఇంకొంతమంది పేకాడుతూ కూర్చున్నారు. చిన్నాకి ఆ

తోటలో ఉంటే చాలా హాయిగా అన్పిచ్చింది. తమలపాకుల పాదులు, పందిళ్లకు పాకిన తమలపాకుల తీగలు, మధ్యమధ్యలో మామిడి చెట్లు, ఆ పాదులకు ఆనుకొని మొదలైన అరటి తోటలు.. బయట మండిపోతున్న రోహిణి కార్తె ఎండలకు విరుద్ధంగా చల్లటి వాతావరణం. అక్కణ్ణించి కదలాలనిపించలేదు.

"నాన్నా. నాకా మావిడికాయ కావాలి" అనడిగాడు చిన్నా, ఓ చెట్టుకు కనిపిస్తున్న మామిడికాయను చూపిస్తా. తిరనాళ్లకొచ్చే జనం దులిపేస్తారనే భయంతో తోటలోని మామిడికాయల్ని రెండు రోజుల ముందే యజమాని కోసేశాడు. కనిపించలేదేమో ఆ ఒక్క మామిడికాయ మిగిలిపోయింది.

మల్లయ్య ఎగిరాడు కానీ ఆ కాయ అందలేదు.

"చెట్టెక్కి కోస్తా" అన్నాడు చిన్నా. "సరే"నని కొడుకుని చెట్టెక్కించాడు మల్లయ్య.

కష్టపడి ఆ కాయని ఎట్లాగో పట్టుకొని కోశాడు చిన్నా. కిందకు దిగుతున్న అతడికి గుడి దగ్గిర శిడిమాను పైకిలేస్తున్న సన్నివేశం కనిపించింది.

"నాన్నా. అక్కడ మేకను పైకి లేపుతున్నారు" అని చెప్పాడు.

"అదేరా శిడి. తొందరేం లేదులే. నెమ్మదిగా దిగు" చెప్పాడు మల్లయ్య. కానీ అప్పటికే ఆలస్యమైంది. ఆదరాబాదరాగా దిగేంతలో కాలు పట్టుతప్పింది. సర్రున జారిపోయాడు చిన్నా. నయం. కిందపడలేదు. మొదలు నుంచి కొమ్మలు వేరయ్యే చోట పడ్డాడు. ఒక కొమ్మని గట్టిగా పట్టుకున్నాడు, కిందపడకుండా.

"అరెరే..." అంటా కొడుకుని కిందికి దించాడు మల్లయ్య.

చేతిమీద చల్లగా ఏదో పడింది. చూస్తే నెత్తుటి చుక్క. అప్పటికే చేయి చూసుకుంటున్నాడు చిన్నా. ఎడమచేయి మధ్యలో చర్మం చీరుకుపోయి ఎర్రగా కనిపిస్తోంది. ఆ నెత్తుటి వెనుక తెల్లటి చర్మం.

గబగబా దగ్గర్లో ఉన్న ఏదో మొక్క ఆకుల్ని కొన్ని తుంచి, వాటిని గట్టిగా వొత్తాడు. రసం బొట్లు బొట్లుగా గాయం మీద పడ్డాయి. మంటతో "అమ్మా" అన్నాడు చిన్నా.

"ఓర్చుకో. దెబ్బ తొందరగా మానిపోతుంది ఈ రసంతో" ధైర్యం చెప్పాడు మల్లయ్య.

ఇద్దరూ శిడిమాను కాడికి పోయారు. శిడి పూర్తిగా పైకిలేచింది. దూలాన్ని కింద స్తంభానికి గట్టిగా కట్టేశారు. బోనులో ఉన్న మేక మొహాన పసుపు, కుంకుమ బొట్లు. మెడలో దండ.

ఏవో మంత్రాలు చదువుతా "కానియ్యండి" అన్నాడు పూజారి.

మరుక్షణం అక్కడే ఉన్న ఒక పెద్దాయన, చేతిలోని టెంకాయని గట్టిగా విసిరాడు. అది మేక మొహంవేపు బోనుకు గట్టిగా తగిలింది. ఠప్పున పగిలింది కాయ. ముక్కలు చెల్లా చెదురుగా పడ్డాయి. మేక భయంతో "మే.. మే.." అనరిచింది.

ఆ తర్వాత అక్కడున్నవాళ్లంతా టెంకాయలు మేకమీదికి విసురుతున్నారు. విపరీతమైన భయంతో మేక అదేపనిగా అరుస్తోంది. బోనుకు తగిలి పగిలిన కొబ్బరి చిప్పలు కొన్ని దాని వొంటికి తగులుతున్నాయి. అది కేకలు పెడుతుంటే కిందనున్న జనం కేరింతలు కొడుతున్నారు. రాక్షసానందంతో ఈలలు వేస్తున్నారు. చూసిన చిన్నా "అయ్యో పాపం మేక" అన్నాడు జాలిగా.

మేక పడుతున్న బాధ చూస్తుంటే చిన్నారి చిన్నా గుండెను ఎవరో మెలి తిప్పుతున్నంత బాధగా ఉంది. పొట్టలో దేవినట్లుగానూ ఉంది. కళ్లముందు ఒక ప్రాణమున్న మేకని అట్లా కొట్టి హింసిస్తూ అక్కడి జనం ఎట్లా ఆనందం పొందుతున్నారో అతడికి అర్థం కావడం లేదు.

"నాన్నా, పాపం ఆ మేకని అట్లా బాధపెట్టడమెందుకు? చూడు అదెట్లా వొణికిపోతోందో. ఒకేసారి దాన్ని చంపెయ్యొచ్చు కదా?" అడిగాడు తండ్రిని బాధగా.

కొడుక్కి ఏమని చెబుతాడు మల్లయ్య. "అది ఆచారంరా అబ్బాయ్. మనం ఏమీ చెయ్యలేం. ఆచారాన్ని మార్చలేం" అన్నాడు.

తండ్రి మాటలు చిన్నాకి నచ్చలేదు. కాని తండ్రి ఈ విషయంలో ఏమీ చెయ్యలేడనే సంగతి అర్థమైంది. మేక పడుతున్న కష్టం, దాని కదలికల్లో తెలుస్తున్న మరణ భయం అతడి చిట్టిగుండెని నిలవనీయకుండా చేస్తోంది.

ఆ పనిని ఎట్లాగైనా అడ్డుకోవాలి. మేకని కాపాడాలి. కానీ ఎట్లా? కింద వందలమంది జనం.. ఎక్కడెక్కణ్ణించో వొచ్చి ఈ దారుణమైన పనిని చూస్తూ ఆనందం పొందుతున్న వాళ్లని ఎట్లా ఆపడం?

చిన్నా ప్రాణం కొట్టుకుపోతోంది. ఒకటే ధ్యాస. ఆ దారుణాన్ని ఆపాలి. మేకని ఆ హింస నుంచి కాపాడాలి. ఎక్కణ్ణించి వొచ్చిందో అంత మొండి ధైర్యం!

తండ్రి చేతిని వొదిలించుకుని సర్రున పరిగెత్తాడు. మల్లయ్య తేరుకునేలోపే శిడిమాను దూలం వొద్దకు చేరుకున్నాడు.

"రేయ్ చిన్నా.. అబ్బాయ్.. ఆగరా.. ఎక్కడికి?" అంటూ వెంటపడ్డాడు మల్లయ్య. అక్కడి జనం ఆశ్చర్యంగా, కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నంతలోనే దూలం మీదికి ఎగిరి, పైన పడుకుని, గట్టిగా పట్టుకున్నాడు. బల్లిలా దానిపై పాక్కుంటూ పోయాడు.

మల్లయ్య గుండె గుభేల్మంది. ఓవైపు జనం శిడిమాను మీదికి టెంకాయలు విసిరి కొడుతూనే ఉన్నారు. అవి చిన్నాకి తగిలితే.. వొణికిపోయాడు. వొళ్ళంతా చెమట్లు పట్టేశాయి.

"రేయ్ అబ్బాయ్. ఏం చేస్తున్నావ్. కిందికి దిగరా. ప్రమాదంరా. దెబ్బలు తగుల్తాయిరా" అని కేకలు పెట్టాడు. జనం గోలలో అతడి మాటలు చిన్నాకి వినిపించలేదు. వినిపించినా పట్టించుకునే స్థితిలో లేడు.

దూలంపైన పాక్కుంటూ బోను దగ్గరకు చేరుకున్నాడు చిన్నా. అసలే అంతకుముందు చెట్టుమీద జారి చీరుకుపోయిన చెయ్యి. పాకుతుంటే రాపిడై నెత్తురు కారుతోంది. బాధను పంటి బిగువున ఓర్చుకుంటూ బోనుని పట్టుకున్నాడు. టెంకాయలు విసరొద్దని అడ్డంగా చెయ్యి ఊపాడు.

అతణ్ణి చూస్తున్నా, జనం టెంకాయలు విసరడం ఆపలేదు.

"అయ్యా ఆపండి. టెంకాయలు విసరమాకండి" అని గట్టిగా అరుస్తున్నాడు మల్లయ్య ఏడుస్తా. అంతలోనే జరగరానిది జరిగిపోయింది. ఒక టెంకాయ నేరుగా చిన్నా తలని బలంగా తాకింది. "అమ్మా" అని కేకేశాడు. అతడి చేతులు బోనుని వొదిలేశాయి. పట్టు తప్పిపోయింది. ఆమైనే కిందపడ్డాడు.

"అబ్బాయ్ చిన్నా" అని పెద్దగా అరుస్తా చేతులు చాపాడు మల్లయ్య. నేరుగా అతడి చేతుల్లో పడ్డాడు చిన్నా. అంత పైనుంచి పడటంతో, ఆ బరువుని తట్టుకోలేక మల్లయ్య కిందపడ్డాడు. నయం. రాయిపై పడకుండా ఇసుకలో పడ్డాడు. ఒక్కసారిగా అక్కడ కోలాహలం. ఎవరో ఆపినట్లే టెంకాయల ప్రవాహం ఆగిపోయింది. అంతా ఆ తండ్రీకొడుకుల చుట్టూ మూగారు. చిన్నా నుదుటి మీంచి ధారగా నెత్తురు. అతడు స్పృహలో లేడు. ఒకాయన నాడి చూశాడు.

"పిల్లాడు బతికే ఉన్నాడు" అన్నాడు. ఇంకొకతను గబగబా ఏదో ఆకుపసరు చిన్నా తలపై పిండాడు.

మంటకి అటూ ఇటూ కదిలాడు చిన్నా.

"వేలెడంత లేడు. ఎంత పని చేశాడు. ఎందుకెక్కాడు శిడిమీదికి?" అందరి నోటా ఇవే మాటలు.

*    *    *

"ఆ రోజుతో శిడిమాను మీదికి టెంకాయలు విసరడం ఆగిపోయి, పూలదండలు విసరడం మొదలయ్యింది. అప్పట్నించి ప్రాణభయంతో మేక అరుపులు లేవు. దాని బలి ఆగిపోకపోవచ్చు. కాని గంటలకొద్దీ అది పడే హింస మాత్రం ఆగింది" చెప్పి ఆగాడు చతుర్వేది.

"ఇదంతా నీకెట్లా తెలుసు? అంతా చూసినట్లే చెప్పావు" అడిగింది కావేరి.

"నాకు తెలుసు. నేను చూశా" అన్నాడు సన్నగా నవ్వుతూ.

ఏదో గుర్తుకు వొచ్చినట్లు అతడి నుదుటి వొంక పరీక్షగా చూసింది. నుదుటిపై జుట్టు మొదలయ్యే చోట నల్లటి గాయం మచ్చ. గబుక్కున అతడి డమ చెయ్యి పట్టుకొని చూసింది. మోచేతి పైభాగంలో పెద్ద గాయం గుర్తు.

"అమ్మదొంగా.. చిన్నా.." అంది కావేరి అతడి జుట్టులోకి వేళ్లు పోనిచ్చి అటు ఇటూ కుదుపుతా..




నేను ఏయిర్ పోర్ట్ చేరుకునేసరికి విమానం ఇంకా రన్ వే మీద ఉంది. ఇంకా బయలుదేరలేదు. ఏదో సాంకేతిక లోపల వల్ల ఆగిపోయింది. పరుగులాంటి నడకతో లాడర్స్ చేరుకున్నాను. నా టిక్కెట్టు ఏయిర్ హోస్టెస్ కు చూపించాను. ఆమె నా సీటు చూపించి వెళ్ళిపోయింది. నా పక్కనే నా వయస్సు ఉన్న అమ్మాయి ఉంది. చక్కగా పట్టుచీర పట్టు జాకెట్టు వేసుని సంప్రదాయబద్ధంగా ఉంది. చేతిలో పసిపాప ఉంది. పాప గాఢంగా నిద్రపోతుంది. ఉలకటం లేదు పలకటం లేదు. కనీసం చిన్నగా కదలటం కూడాలేదు. అంత గాఢంగా నిద్రపోతుంది.

నిన్నటితో నేను మలేషియా వచ్చిన పని పూర్తయింది. నా కంపెని అప్పగించిన పని విజయవంతంగా పూర్తిచేశాను. చెప్పిన సమయం కంటే పదిరోజులు ముందే ప్రాజెక్ట్ పని ముగిసింది. రాత్రి నా కొలిగ్స్ పార్టీ అరెంజ్ చేశారు. మా క్లయింట్ సభ్యులు కూడా వచ్చారు. అందరం చక్కగా పార్టీని ఎంజాయ్ చేశాం. నా క్లయింట్స్ నన్ను అభినందించి వీడ్కోలు చెప్పారు. పార్టీ

ముగిసేసరికి రాత్రి పదకొండుగంటలైంది. అయిన సాకేత్ కు కాల్ చెయ్యటం నేను మరచిపోలేదు. సాకేత్ ఇండియలో నా కొలిగ్. నా కంటే సీనియర్. ఇద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళికూడా చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. మాకు నిశ్చితార్థం కూడా ముగిసింది. ఇంకో నెలలో పెళ్ళిచెయ్యాలని మా పెద్దవాళ్ళు నిర్ణయించారు. అప్పుడే ఊహించని సమస్య వచ్చింది. ఆ సమస్య మా కంపెని యం.డి వైపు నుంచి వచ్చింది. మా కంపెనికి మలేషియాలో ఒక పెద్ద ప్రాజెక్ట్ దొరికింది. వందకోట్ల ప్రాజెక్ట్. ఆ ప్రాజెక్ట్ ను ఒక సంవత్సరం లోపు పూర్తిచెయ్యాలి. మేనేజ్ మెంట్ నన్ను ఎన్నుకుంది. నాకు సహాయంగా ఇంకో అయిదుగురిని సెలక్ట్ చేసింది.

నాకేం చెయ్యాలో తోచలేదు. ఒక వైపు పెళ్ళి ఇంకో వైపు వృత్తి నన్ను అడకత్తెరలో పోకచెక్కలా నలిపేశాయి. సాకేత్ ను సలహా అడిగాను.అతను నన్ను వెళ్ళమని సలహా ఇచ్చాడు. పెళ్ళి ఈ రోజు కాకపోతే రేపు చేసుకోవచ్చు. కాని ఇలాంటి ప్రాజెక్ట్ మళ్ళి మళ్ళి రాదు. పైగా ఇది నీ కెరీర్ కు ఎంతో ఉపయోగం అన్నాడు. గత్యంతరంలేక సరే అన్నాను. పదిహేను రోజుల తరువాత నా టీమ్ తో మలేషియా బయలుదేరాను. స్టాఫ్ తో పాటు నా తల్లి తండ్రి సాకేత్ తల్లి తండ్రి కూడా వచ్చారు. కన్నీటితో నాకు వీడ్కోలు ఇచ్చాడు సాకేత్.

మలేషియా చేరుకున్న తరువాత ఒక్క క్షణం కూడా నేను వేస్ట్ చెయ్యలేదు. నా టీమ్ ను బాగా మోటివేట్ చేశాను. వాళ్ళతో నేను ఒక నాయకురాలిగా ప్రవర్తించలేదు. స్నేహితురాలిలా ప్రవర్తించాను. నేను కూడా వాళ్ళతోపాటు కష్టపడ్డాను. అనుకున్నట్టుగానే ప్రాజెక్ట్ పని విజయవంతంగా పూర్తిచేశాం. నిన్నటితో నేను మలేషియా వచ్చిన పని పూర్తయింది. ఈ రోజు ఇండియా బయలుదేరుతున్నాను.

“నా పేరు మీనాక్షి”అంది నా పక్కన కూర్చున్న అమ్మాయి.

“నా పేరు నిశ్చల”అన్నాను ఆలోచనలనుంచి తేరుకుని.

“మీరు మలేషియాలో ఉంటున్నారా”అడిగింది మీనాక్షి.

“కాదు. ప్రాజెక్ట్ పనిమీద వచ్చాను. అది పూర్తయింది. ఇండియా బయలుదేరుతున్నాను”అన్నాను. ఆ తరవాత మా సంభాషణ ఉద్యోగం గురించి సాగింది.

“నేను కూడా బాగా చదువుకున్నాను. నాకు ఉద్యోగం చెయ్యాలని ఉంది. కాని మా వారు ఒప్పుకోలేదు.”

“ఎందుకు?

“నీకు ఉద్యోగం చెయ్యవలసిన అవసరంలేదు. ఆఉద్యోగం వల్ల నీకు అదనపు డబ్బు వస్తుంది అంతే. కాని అదే ఉద్యోగం ఒక మగవాడికి ఎంతో అవసరం. దానితో అతను తన కుటుంబాన్ని పోషించుకుంటాడు. ఒక చిన్న కుటుంబం ఆ జీతంలో బతుకుతుంది”అన్నారు అంది మీనాక్షి.

“పాపకు ఏమైంది. వచ్చినప్పటినుంచి నిద్రపోతుంది”అన్నాను.

“పాపకు ఒంట్లో బాగాలేదు. నిన్నటినుంచి జలుబు జ్వరం. నిన్నరాత్రి మా నాన్నగారికి బాగాలేదని తెలిసింది. వెంటనే రమ్మని చెప్పారు. మామూలుగా అయితే పాపను ఆయన దగ్గర విడిచిపెట్టి నేను ఒంటరిగా బయలుదేరేదాన్ని. కాని ఆయన రెండురోజులకు ముందే వేరే ఊరికి వెళ్ళారు. పాపను నౌకర్ల దగ్గర విడిచిపెట్టటం నాకు ఇష్టంలేదు. అందుకే పాపతో బయలుదేరాను. బయలుదేరేముందు కొంచం సెడిటివ్ ఇచ్చాను. అందకే కదలకుండ మత్తుగా నిద్రపోతుంది”అంది మీనాక్షి.

నేను ఏదో చెప్పబోయాను. అప్పుడే విమానం భయంకరంగా ఊగింది. ఆ కదలికకు ప్రయాణికులందరు అల్లాడిపోయారు. అందరు తలో దిక్కుకి పడిపోయారు. నేను వెళ్ళి విసురుగా ఎదురుగా ఉన్న సీటుకు గుద్దుకున్నాను. నా కళ్ళు బైర్లు కమ్మాయి. కొంచంసేపు అచేతనంగా ఉండిపోయాను. మీనాక్షి కూడా నా పరిస్థితి ఏర్పడింది. ఆమె చేతిలో ఉన్న పాప ఎగిరివెళ్ళి కింద పడింది. అదృష్టవశతు వెంటనే విమానం కంట్రోల్ అయింది. ఏయిర్ హోస్టెస్ వచ్చి అందరిని పరమర్శించింది. మీనాక్షి చేతులో ఉన్న పాపను పరీక్షించబోయింది. కాని మీనాక్షి ఒప్పుకోలేదు. దానికి కారణం నాకు మాత్రమే అర్ధమైంది. కొంచంసేపయిన తరువాత నేను టాయ్ లెట్ కు వెళ్ళాను. అక్కడ ఉన్న టిష్యు పేపర్ మీద కొన్ని వివరాలు రాసి రహస్యంగా ఏయిర్ హోస్టెస్ కు ఇచ్చాను. ఈ విషయం మీనాక్షి గమనించలేదు.

షెడ్యుల్ ప్రకారం విమానం హైదరబాదులో లాండ్ అయింది. కస్టమ్స్ కౌంటర్ దగ్గర మీనాక్షని పోలీసులు అడ్డగించారు. ఆమె చేతులో ఉన్న పాపను బలవంతంగా లాక్కున్నారు. అక్కడే ఉన్న డాక్టర్ పాప కడుపును కత్తితో కోశాడు. లోపల చాల వజ్రాలు కనిపించాయి. స్మగ్లింగ్ చేస్తున్నందుకు మీనాక్షిని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకువెళ్ళిపోయారు.

“అసలు పాప కడుపులో డైమండ్స్ ఉంటాయని నీకు ఎలా తెలిసింది”అడిగాడు సాకేత్.

“పాపను చూసినప్పటినుంచి నాకు ఎందుకో అనుమానం కలిగింది. పాప ఉలకదు పలకదు. ఎంత గాఢంగా నిద్రపోతున్న కొంచంమైన కదలిక ఉంటుంది. కాని పాపలో బొత్తిగా కొంచం కూడా కదలిక కనిపించలేదు. విమానం ఊగినప్పుడు పాప ఎగిరి కిందపడింది. అప్పుడే కూడా లేవలేదు. అంతేకాదు పాప కడుపు మీద ఆపరేషన్ చేసిన గుర్తులు కనిపించాయి. దాంతో పాప సజీవంగా లేదని అర్ధమైంది. అప్పుడే కొన్ని రోజులకు ముందు పేపర్ లో చదివిన వార్త గుర్తుకువచ్చింది. ఇటివల మలేషియ హైదరబాదు రూట్ లో విపీరతంగా స్మగ్లింగ్ జరుగుతోంది. పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉన్నా స్మగ్లర్స్ ను పట్టుకోలేకపోయారు. ఇందులో పోలీసుల తప్పు ఏం లేదు. స్మగ్లర్స్ చాల తెలివిగా ప్రవర్తిస్తున్నారు. చనిపోయిన పాప కడుపులో వజ్రాలు పెడుతున్నారు. తరువాత కడుపుని కుట్టేస్తున్నారు. ఒక పసిపాప శరీరంలో వజ్రాలు ఉంటాయని ఎవరు మాత్రం ఊహించగలరు.

దాంతో నాకు అంతా అర్ధమైంది. వెంటనే కాగితంలో నా అనుమానం రాశాను. మీనాక్షికి తెలియకుండ ఆ కాగితాన్ని ఏయిర్ హోస్టెస్ కు ఇచ్చాను. వెంటనే ఆమె ఈ సమాచారాన్ని ఏయిర్ పోర్ట్ అధికారులకు తెలిపింది. అంతే తరువాత ఏం జరిగిందో నీకు తెలుసు”అన్నాను ముగిస్తూ.

సాకేత్ ఏదో మాట్లాడబోయాడు. అప్పుడే నా సెల్ రింగ్ అయింది. కమీషనర్ ఆఫ్ పోలీస్ కాల్ చేశాడు. “మిస్ నిశ్చల. మీ తెలివి అద్భుతం. మీ సహాయం వల్ల ఒక పెద్ద ఇంటర్నేషనల్ స్మగ్లర్స్ ముఠాను పట్టుకోగలిగాం. డిపార్ట్ మెంట్ మీ సహాయాన్ని ఎప్పటికి మరచిపోలేదు. అందుకే మిమ్మల్ని గౌరవించటానికి నా అఫీసులో ఒక చిన్న ఫంక్షన్ ఏర్పాటు చేశాను. మీరు తప్పకుండ రావాలి”అన్నాడు కమీషనర్. అలాగే అన్నాను.

“నువ్వు మాములు అమ్మాయివికాదు. ఫైర్ బ్రాండ్ వి. నీకు భర్త కాబోతున్నందుకు నాకు చాల గర్వంగా ఉంది”అన్నాడు సాకేత్ నన్ను దగ్గరికి తీసుకుని. నేను ఆనందంగా నవ్వాను .

సమాప్తం




శ్మశానం లో ఎవరిదో శవం కాలుతోంది. కాటికాపరి రుద్రయ్య దగ్గరుండి పనులు చూస్తున్నాడు. నల్లగా మబ్బులు పట్టి, చిన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి. శవం తో పాటు వచ్చిన బంధువులు తలో ఒక దిక్కుకు వెళ్ళారు. చితికి నిప్పంటించినతను మాత్రం అక్కడే వున్నాడు. "రేయ్ ! శివుడు వర్షం వస్తుంది., కట్టెలు తడిసిపోతున్నాయి. కొన్ని లోపల పెట్టరా" అంటూ కేకేసాడు రుద్రయ్య.

శ్మశానం లో ఓ మూల రేపో, మాపో, కూలడానికి సిద్ధం గా వున్న తాటాకుల ఇంటిలో నుండి ఓ పన్నెండేళ్ళ కుర్రాడు వచ్చాడు. "తాతా! రేపు పరీక్షలున్నాయి, మధ్యలో నీ గోలేంది" అన్నాడు. "సరేగాని రెండు కట్టెలు లోపల పెట్టరా... రేపు వచ్చే వాళ్ళకి కావాలి" అన్నాడు. వాడు జారిపోతున్న నిక్కరును పైకి లాక్కుంటూనే వెళ్ళి ఒక్కొక్క కట్టె తెచ్చి ఇంటిలో పేరుస్తున్నాడు. వర్షం తగ్గింది. శవం తాలూకు మనుష్యులు వెళ్ళిపోయారు. పొయ్యి మీద నుండి దించిన వేడివేడి సంగటిని వ్రేళ్ళతో కెలుకుతూ "తాతయ్యా! దయ్యాలున్నాయా?.." అడిగాడు శివుడు. రుద్రయ్య సమాధానం ఇవ్వలేదు. శ్మశానం లో దయ్యాలు వుంటాయి. నువ్వెప్పుడైనా చూసావా అని ప్రెండ్సు నన్నడిగారు. అందుకే నిన్ను అడిగాను తాతా!" అన్నాడు శివుడు. మనవడి మాటలకు రుద్రయ్య పెద్దగా నవ్వేసాడు. చింకి చాపపై పడుకుని నిద్రపోతున్న శివుడికి, చిరిగిన దుప్పటి ఒకటి కప్పి ప్రేమగా నిమురుకున్నాడు.

నిజానికి రుద్రయ్యకి, శివుడికి ఏ సంబంధం లేదు. ఒక పిచ్చిది స్మశానం లో శివుడిని కని చనిపోయింది. ఆ అనాధ శవానికి రుద్రయ్యే కర్మకాండలు చేసాడు. శివుడిని అక్కున చేర్చుకున్నాడు. తెల్లవారింది. కట్టెలను తీసి ఎండలో ఆరబెడుతున్నాడు రుద్రయ్య.

ఇంతలో కొంతమంది ఒక శవాన్ని తీసుకువచ్చారు. వాళ్ళ ముఖాలు చాలా ఆందోళనగా వున్నాయి. రుద్రయ్య శవదహన కార్యక్రమాలు చూస్తున్నాడు. "నా విషయం తేలిన తర్వాతే ఈయనకు నిప్పెట్టు." ఒక ఆడగొంతు వినిపించడం తో రుద్రయ్య వెనక్కి తిరిగి చూసాడు. "ఏంటి తేలేది. నేను అమెరికాలో వున్నప్పుడు ఆయన ఇల్లుని నీ పేరు మీద రాయించుకుని, ఇప్పుడు మిగతా వాటిల్లో వాటా అడగడానికి సిగ్గులేదు " ఒక మగ గొంతు గయ్యిమని లేచింది. వాళ్ళ మాటలను బట్టి, చనిపోయిన వ్యక్తి కూతురు, కొడుకులే ఈ గొడవపడుతున్నారని రుద్రయ్యకి సులభం గానే అర్ధమైంది. ఆడవాళ్ళకీ ఆస్థిలో సగం వాటా వుందని, లేదంటే కోర్టుకు వెళతానని ఆమె, నీ ఇష్టం వచ్చింది చేస్కో అని ఇతను అరుస్తూనే వున్నారు. వీళ్ళ వెనుక వచ్చిన బంధువులు సైతం చెరొక పక్క వకాల్తా పుచ్చుకుని వాదులాడుకోవడం ప్రారంభించారు. అయ్యా! సమయం మించిపోతుంది. ఈ కార్యక్రమాన్ని తొందరగా ముగించండి. రుద్రయ్య చెప్పాడు. కాని వాళ్ళెవరు రుద్రయ్యని, ఆ శవాన్ని పట్టించుకోలేదు. ఈ గొడవకు లోపల చదువుకుంటున్న శివుడు, రుద్రయ్య దగ్గరికి వచ్చి తాతయ్యా! ఏం జరుగుతోంది. అడిగాడు. "నిన్న దయ్యాలున్నాయా? అని అడిగావు కదా! వున్నాయి. ఆస్థి కోసం కన్నతండ్రి శవం ముందే కొట్టుకుంటున్న దయ్యాల్ని చూడు అని గొడవపడుతున్న వాళ్ళని చూపాడు రుద్రయ్య.

శివుడికి అర్ధంకా అయోమయం తో ఆ గొడవపడుతున్న వాళ్ళని, తాత రుద్రయ్యన్ని మార్చి మార్చి చూస్తున్నాడు.




ర్చుని ఏదయినా లైన్ అనుకుంటే చర్చించుకుని

దాన్ని ఇంప్రూవైజ్ చేయచ్చు గానీ...''ఏదో చెప్పబోయాను.

“మీకు కాఫీ, టీలు కావాలంటే... పక్కనే వాచ్ మెన్ ఉంటాడు తెప్పించుకోండి. రెండున్నర కల్లా భోజనం వస్తుంది” అని చెప్పేసి తను కూడా వెళ్లిపోయాడు.

ఒకటి హాలివుడ్ సినిమా...

అందులో పుంఖానుపుంఖంగా నగ్న దృశ్యాలు..

“ కొంచెం రివైండ్ చేయి గురూ.. మళ్లీ చూద్దాం” అంటూ మాలో ఒకరు అడగటం.. అందులో చూసిన సన్నివేశాలనే మళ్లీ మళ్లీ చూడటం... సమయం అంతా అలా గడిచిపోయింది.

“ఈ సినిమా నుంచి మనం నేర్చుకునేదేముంది. అక్రమ సంబంధాలపైన సినిమా.. భార్య, ఆమె ప్రియుడు కలసి భర్తను ముక్కలుముక్కలుగా నరికి చంపేస్తారు. చంపటం అనేది అనేది అత్యంత పాశవికంగా సాగుతుంది. సన్నివేశాలు ఒళ్లు జలదరించేలానే కాదు, జుగుప్స గొలిపేలా ఉన్నాయి. ఇది మన తెలుగు నేటివిటీకి సరిపోదు కదా” అన్నాను .

“ అది సరిపోతుందా లేదా అనేది మనకు అనవసరం. చూడటం.. ఆ తర్వాత డైరక్టర్ ఏం చెబుతాడో విని దానిని బట్టి మనం చేయటం అంత వరకే” అన్నాడు హృషీకేష్.

మొదటిసారి నా అభిప్రాయాన్ని ఖండిస్తూ అన్నాడు.

అక్కడున్న మిగిలిన ఇద్దరిలో ఒకరు దర్శకుని దూరపు బంధువు. మరొకతను అతని కులం వాడే. సినిమా రంగంలో కులానికున్న ప్రాధాన్యం అంతా ఇంతాకాదు. పదిహేనేళ్లుగా అతను ఇదే పనిలో ఎలా ఉన్నాడో మొదట అంతుబట్టలేదు.

దర్శకుడి వెనక అతని గురించి అనుకునే మాటలన్నింటిని చేరవేసే పని అతను చేస్తాడని... ఈ పనిచేయటం కోసమే దర్శకుడు

అతన్ని ఇక్కడ ఉంచాడనీ రెండ్రోజుల తర్వాత గానీ నాకు అర్ధం కాలేదు.

“ రాత్రి 7.30, 8 గంటల ప్రాంతంలో డైరక్టర్ వచ్చాడు.

“ సినిమా ఎలా ఉంది?” అడిగాడు.

“ అద్భుతంగా ఉంది సార్. మీరేది సెలక్టు చేసినా మా గొప్పగా ఉంటుంది. మళ్లీ మళ్లీ చూడాలనిపించేదిగా ఉంది” మధ్యాహ్నం చూసిన బూతు సన్నివేశాలు మనసులో గుర్తుచేసుకున్నాడేమో తెలీదు. డైరక్టరును పొగడ్తలతో ముంచెత్తాడు హృషి.

“ కామెడీ సినిమా కూడా చూశారుగా.. సమాంతంరంగా కొన్ని అవే సీన్లు రాసుకుని దాన్ని ఓ హరర్ ఫిల్మ్ గా డెవలప్ చేయగలమేమే చూడండి..” అన్నాడు డైరక్టరు.

మనుషుల భావోద్వేగాలు ప్రపంచమంతా ఒకటే అయినా, దాన్ని వ్యక్తపరిచేతీరులో తేడాలుంటాయి. తమిళసినిమాల్లో లౌడ్ నెస్ ఎక్కువ ఉంటే మలయాళ సినిమాలు సున్నితంగా ఉంటాయి. డైలాగులతో వ్యక్తీకరించటం మనదగ్గర విధానం.“ప్రయోగం పేరుతో పిచ్చి పనులు చేయటం దేనికో?” నాకు అర్ధంకాలేదు. అదేమాట అన్నాను.

“ వెరయిటీ..” అన్నాడు డైరక్టరు .. నన్నో వెర్రివెధవని చూసినట్టుగా చూసి.

“అవును సార్.. ఎక్సలెంట్... చాలా బావుంది.. ఈ కథతో మంచి మసాలా డైలాగులు వండివారిస్తే...” ఓ నిముషం ఆగాడు హృషీకేష్.డైరక్టరు మొహం ప్రకాశవంతమైంది.

“హర్రర్ సినిమాలో సెక్సును బాగా కూరినట్టు..” అంటూ చర్చకు సంబంధం లేని విషయాన్ని ఆసక్తికరంగా వివరించటం మొదలుపెట్టాడు.“ హీరోయిన్ హోటల్లో గది బాత్రూంలో స్నానానికి సిద్ధమవుతూండగా.. హఠాత్తుగా ప్రేతాత్మ ప్రత్యక్షం అవుతుంది.. ఆమె భయంతో విప్పుతున్న బట్టలను కిందకు జార్చేస్తుంది. హీరోయిన్ అర్ధనగ్న శరీరంపైన కెమెరా జూమ్ అవుతుంది.ప్రేక్షకులు ఎగబడి థియేటర్ కొస్తారు.నీరు విప్పగానే కుళాయిలో నుంచి నీరు బదులు రక్తం వస్తుంది.

వణికిపోయిన హీరోయిన్ కళ్లు తిరిగి కిందబడిపోతుంది.ఒంటిపైన ఆచ్చాదన తొలగిపోయి ఉంటుంది. మోకాళ్లపై భాగం వరకూ నగ్నంగా.. ''హృషికేష్ చెబుతుంటే దర్శకుడి కళ్లముందుసన్నివేశాలు కదులుతున్నట్టున్నాయి. ఎంజాయ్ చేస్తున్నట్టు కనిపించాడు.'' చాలా పాత ఆలోచన. ఎన్ని సినిమాల్లో ఇవి చూడలేదూ'' అన్నాను మధ్యలో అందుకుని. దర్శకునికి నా మాటలు రుచించటం లేదని నాకు అర్థం అవుతూనే ఉంది.

'' కొన్ని వందల సినిమాల్లో ఇలాంటి సన్నివేశాలున్నాయి. ఇందులో కొత్తదనం ఏముంది? '' అన్నాను.

దర్శకుడు విసుగ్గా నా వైపు ఓ చూపు విసిరి .. ఆ తర్వాత హృషికేష్ వైపు చూపు తిప్పి '' నువ్వు చెప్పేది కంటిన్యూ చెయ్యి'' అన్నాడు ప్రోత్సాహకరంగా.

'' సన్నివేశాలు పాతవి కావచ్చు. కాని కొత్తగా చెబుతాం...'' అసలు హీరోయిన్ ఇల్లు వదిలి హోటల్ కెందుకు వెళ్లిందనేది ఫ్యామిలీ డ్రామా.. హోటల్లో జరిగింది హర్రర్.. హీరో హీరోయిన్ల మధ్య జరిగే సన్నివేశాలు రొమాంటిక్ గా ఉంటాయి. ఎక్స్ పోజింగ్ కూడా కొత్తగా ఉంటుంది..అన్నీ కలిపి కూరితే కొత్త జెనర్ సినిమా కాక ఏమవుతుంది?'' అన్నాడు గబగబా.

హృషి రచయిత కాబట్టి సరిపోయిందిగానీ.. వాడే దర్శకుడు అయ్యుంటే.. ఈపాటికి ఏ నిర్మాతో బుట్టలో పడిపోయేవాడే..అంతగా మాటలతో గారడీ చేస్తున్నాడు.

''రామ్ సే బ్రదర్స్ లాంటి కొందరు డైరక్టర్లు కొన్ని పదుల సినిమాలు అదే కథతో తీశారు. పంపుల్లో రక్తం కావటం.. హీరోయిన్ హోటల్ గదిలో భయపడటం లాంటివి.. ''నాకూ తెలుసు గురువా... డైరక్టర్ ను బుట్టలో వేయటానికి ఏదో ఒకటి చెప్పాలిగా అన్నాడు హృషి ఆ రాత్రి పడుకునే ముందు.

'' వీడెంత బతక నేర్చిన వాడు '' అనుకోకుండా ఉండలేకపోయాను.

వాడు చెప్పినదానిలో ఏం కొత్తదనముందని డైరక్టర్ మురిసిపోయాడో అర్థం కాక అప్పటి వరకూ నాలో నేను మథనపడుతున్నాను.'' బా.. అన్న అక్షరంతో సినిమా టైటిల్ పెట్టటం నా స్టయిల్. ఓ ఇరవై పేర్లు రాసుంచు. రేపు వచ్చినప్పుడు

మాట్లాడదాం'' అంటూ నాకు పనిపురమాయించి హృషీతో కబుర్లలో పడ్డాడు దర్శకుడు.

"ముందుగా కథ అనుకోకుండా.. టైటిల్ పెట్టేదెలా? ఈ డైరక్టరుకి తలకాయలేనట్టుంది''... విసుక్కున్నాను పక్కవాళ్లదగ్గర.ఆ విషయం డైరక్టర్ చెవిలో వేసారెవరో...

" నాకు తలకాయ లేదు సరే.. .నీకెంత ఉందో నాకు తెలియాలిగా.. ఏదీ నువ్వురాసిన టైటిల్సు చూపించు.. '' డైరక్టర్ మర్నాడు కనపడగానే నన్ను కడిగిపారేశాడు

" సినిమా చూసి.. అది బావోలేదు.. ఇది బావోలేదు అని తేలిగ్గా కామెంట్ చేయటం కాదయ్యా... తీసేవాడికి తెలుస్తుంది బాధ. డబ్బు పెట్టే నిర్మాతను సంతృప్తి పరచాలి. హీరో హీరోయిన్లకు నచ్చేలా చేయాలి. వాళ్లకు నచ్చిన ఆర్టిస్టులను పెట్టుకోవాలి... సంగీతదర్శకుడు, కెమెరామెన్... ఇలా 24 శాఖల వారిని సమన్వయం చేసుకుంటూ పోతేగానీ.. సినిమా తయారవ్వదు.. సినిమా ఫెయిలయితే అందరూ దర్శకుడిని కామెంట్ చేస్తారు. నీకేంతెలుస్తుంది బాధ''

మౌనంగా వింటూ కూర్చున్నాను.

అతి కష్టంమీద నాలుగయిదు టైటిల్సు రాసిచ్చాను.

" పేరులో కవిత్వం ఉంటే ఎవరికి అర్థం అవుతుంది.. ట్రెండ్ అర్థం చేసుకోకుండా సినిమా రంగంలోకి రావటం దేనికి?''ఇలాంటి వాతావరణంలో ఇమడటం రోజురోజుకీ కష్టంగా మారుతోంది.

అలాగని ఇక్కడి నుంచి బయటపడలేను.

" నువ్వేదో పోటుగాడిని అనుకున్నావా?'' దర్శకుడి మాటలకు ఎదురుచెబుతున్నావట?'' నన్ను ఈ దర్శకుడి దగ్గరకు పంపిన కోడైరక్టర్, మా ఊరి వాడే రెండు వారాల తర్వాత ఫోన్లో మందలించాడు.

ఆ తర్వాత ప్రేమపూర్వకంగా సలహా ఇచ్చాడు.

" ఏదో ఓ రకంగా సర్దుకుని వాడి దగ్గరే సెటిల్ అవ్వు. పైకి చాదస్తుడిలా కనిపించినా.. తన దగ్గరున్న వాళ్లని బాగా చూసుకుంటున్నాడన్న పేరుంది." ఆ రాత్రంతా ఆలోచిస్తూండిపోయాను.ఈ గెస్టు హౌస్లో మేం చేస్తున్న పనేమీలేదు. వేళకి తినటం.. పడుకోవటం.. వివిధ భాషల కేసెట్లు చూడటం..నా అవకాశాలు మెరుగుపడేవిగా కనిపించటం లేదు.డైరక్టర్ కొత్తగా ఆలోచించాలంటాడు. అలాగని ఓ మంచి విషయం చెబితే హర్షించడు. బావోలేదన్నట్లు తలాడిస్తాడు. అవతలవాళ్లు పొగడాలని ఆశిస్తాడు.

"కొంచెం మెరుగుపర్చండి అని చెప్పచ్చుగా...అన్నీ బావోలేదని చెబితే... మనం ఇంకా కొత్తగా ఏం ఆలోచించగలం.. ఎంత సేపూ వాడిని ఎలా సంతృప్తిపరచటమా అన్నది ఒక్కటే ఆలోచించటమవుతోంది. " హృషి దగ్గర విసుక్కున్నాను. వాడు నవ్వి వదిలేశాడు.

రోజు రోజుకీ నాలో అసహనం పెరిగిపోతోంది.ప్రతి సిట్టింగ్ లోనూ డైరక్టర్ నన్ను అవమానిస్తున్నట్లుగా అనిపించేది. హృషి చెప్పేది అతను శ్రద్ధగా వింటున్నాడు. అతను వింటున్నాడు అనేకంటే..

దర్శకుడు వినేలా హృషి చెప్పగలుగుతున్నాడు అనటం సబబేమో?

రేపోమాపో సినిమా అవకాశమొస్తే.. ఖచ్చితంగా అతను హృషి వైపే మొగ్గు చూపుతాడు.

ఆ విషయం అర్థమవుతూనే ఉంది. హృషి పైన కోపం మొదలయ్యింది.

అది ద్వేషంగా మారటానికి ఎన్నో రోజులుగా పట్టలేదుదర్శకుడి పరోక్షంలో అతన్ని విమర్శించేవాడు.. ఎదురుగా పొగడ్తలతో ముంచెత్తేవాడు.'బతకనేర్చిన వెధవ' మనసులోనే తిట్టుకునేవాడిని.నిన్న రాత్రి రూంకి తిరిగొచ్చి మందు తాగుతున్నాను.' ఏంటి? నువ్వొక్కడివే సిట్టింగ్ వేశావ్? నవ్వుతూ పలకరించాడు.

' డైరక్టరు గాడి చెప్పులు నాకే కుక్కా? పిచ్చివాగుడు వాగకు.."అన్నాను కోపంతో.

“ కూల్ .. కూల్…” అన్నాడు నాకు నచ్చచెప్పేధోరణిలో.

“ నోర్ముయ్.. ” ఓ బూతు మాట ప్రయోగించాను.

“నేను చెప్పేది జాగ్రత్తగా విను. సినిమా రంగంలో ముక్కుసూటితనం అసలు పనికిరాదు. లాబీయింగ్ చేస్తేనే ఇక్కడ అవకాశాలు దొరుకుతాయి. మాటలతో అవతలవాడిని పడగొట్టాలి. ఇంద్రుడు, చంద్రుడు అంటూ ఉబ్బేయాలి. అప్పుడప్పుడు వాడు మనల్ని నెత్తిన పెట్టుకుంటాడు. అవకాశాలు కూడా మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. ”

నచ్చేచెప్పేధోరణితో ఏదో చెప్పబోయాడు హృషి.

మద్యం మత్తు పూర్తిగా నా తలకెక్కింది.

దర్శకుడిమీద కోపం.. పరిస్థితులను ఎదుర్కోలేకపోతున్నా నన్న అసహనం.ఒక్కసారిగా నా మీద దాడిచేశాయి. విచక్షణ కోల్పోయాను.నేను విసిరిన గాజు గ్లాసు భళ్లుమని అతని నుదుటికి గాయం చేసింది.

హృషి నుదుటి చుట్టూ తెల్లని బ్యాండేజి.

నాకు సిగ్గేసింది.

నన్ను ద్వేషించకుండా… ప్రతీకారం గురించి ఆలోచించకుండా ఉదయానే వచ్చి నన్ను కలవటం.. ఎప్పటిలానే ప్రేమపూర్వకంగా మాట్లాడటం..

ఇలా చేయటానికి ఎంత గొప్ప వ్యక్తిత్వం ఉండాలి.

“ మా అందరి కంటే తెలివైన వాడివి…” అంటూ ప్రారంభించాడుహృషి.ఇప్పుడు ఆలోచిస్తుంటే నేనెంత తప్పు చేశానో అర్థం అయ్యింది. క్రమంగా మబ్బు తెరలు తొలగుతున్నాయి.“డైరక్టరు చెప్పే అభిప్రాయం మనకి నచ్చకపోవచ్చు. ఆ విషయం వాడి మొహం చెప్పి నష్టపోవటం దేనికి? అవకాశాలు ఇవ్వవలసిన వాడు డైరక్టరు. అతన్ని కాదని మనం బావుకునేదేముంది?”హృషి చెప్పుకుపోతున్నాడు.“వీడు కాకపోతే.. ఇంకొక డైరక్టరు అంటావా? ఎంతకాలం ఇలా వెతుకులాడగలం. సినిమా గ్రౌండయితే ఏంటి? కాకపోతే ఏమిటి? మనమేమి నష్టపోవటం లేదు కదా?ఆలోచించు” అన్నాడు.

నేను మాట్లాడలేదు.

“నువ్వు బయట ఉండి తలబద్దలు కొట్టుకుని కథ రాస్తే నీకు వచ్చేదెంత?

మూడొందలో, ఐదొందలో.. అంతే కదా.. ఇక్కడ రచయితగా మనకు అవకాశాలు రాకపోయినా.. డబ్బు బానే ముడుతోంది కదా? రాచమర్యాదలకి తక్కువేం ఉండవు. కావలసినంత తిండి, మందు, కోరుకుంటే అమ్మాయిలు..

నేను ఇలాంటి సాంప్రదాయాలకు దూరం అని మడి కట్టుకుని కూర్చుంటానంటే.. కొన్ని అనుభవాలు, ఆనందాలు నీ నుంచి దూరమవుతాయి. అది వేరే విషయం…. … …”

“నేనేదో అనుభవం ఉన్నవాడినని ఈ మాట చెప్పటం లేదు. నా కంటే ఎక్కువ ప్రతిభ ఉన్న నువ్వు మానసికంగా నలిగిపోవటం చూసి తట్టుకోలేక ఈ ముక్క చెబుతున్నాను.” అన్నాడు.

నిష్టూరంగా కనిపించినా వాడు చెప్పిన మాటలు అక్షర సత్యాలుగా అనిపించాయి.

“ ఈ రంగంలో ఉన్న నటులు గానీ, దర్శక రచయితలు గానీ ఎవరూ ఒక్క రోజులో గొప్పవాళ్లు కాలేదు. సంవత్సరాల కొద్దీ ఓర్పుగా ఎదురుచూస్తే గానీ అవకాశం వాళ్ల తలుపుతట్టలేదు. ఎంతో శ్రమిస్తేగానీ వాళ్లు ఓ స్థాయికి చేరుకోలేపోయారు గురువా…

మళ్లీ చెబుతున్నాను. నువ్వు తెలివైనవాడివి...

నిస్పృహతో వచ్చిన అవకాశాలను కాలదన్నుకోకు"...

' ఏమో ఎవరికి తెలుసు... రేపెప్పుడో నువ్వే గొప్ప దర్శకుడివవుతావేమో... అప్పుడు ప్రపంచమంతా నీకు హారతులు పడుతుంది. ఈ దర్శకుడిలాంటి వాళ్లు నువ్వు చెప్పిందానికల్లా తలాడిస్తారు. ఆరోజు వచ్చేవరకూ..."

ఇంకేదో చెబుతున్నాడు హృషి.

ఒకే చోట ప్రారంభమయినా మా ఇద్దరిలో ఎంత తేడా...

ఉన్నదాంట్లో నుంచి అవకాశాలను పిండుకోవాలంటాడు అతను.

ఎప్పుడూ పరిస్థితులను నిందించడు. ఓర్పుగా, నేర్పుగా వ్యవహరిస్తాడు...అన్నీ తనకు అనుకూలంగా మార్చాడు.

మరి నేను...

నేను పరిస్థితులతో రాజీపడలేను. వ్యక్తులతో సర్దుకోలేను. గెలవాలని తాపత్రయపడతాను. ఆ గెలుపు ఒక్కరోజులో సాధ్యం కాదని వాస్తవాన్ని అర్థం చేసుకోలేను.

ఇతరులు లౌక్యంగా వ్యహరించటాన్ని భరించలేను.

దానికి స్వార్థం అని పేరుపెడతాను.

హృషి ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోతే..

నేను మరుగుజ్జులా కుంచించుకుపోతున్నాను.

ఈ ఒక్క అనుభవమయినా నాలో పరివర్తన తెస్తుందా?

భవిష్యత్తు గాడిలో పడుతుందా?

ఏమో...?

కాలమే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.




వదినగారూ మీకు పిండి రుబ్బటం వచ్చా? " అడిగాడు ఆనంద్.

గులాబ్ జామూన్ నోట్లో పెట్టుకోబోతున్న సుమతి స్పూన్ అలాగే పట్టుకొని " వచ్చండి, ఎందుకు అడుగుతున్నారు?" ప్రశ్నించింది.

"మరేమీ లేదు. నా పర్స్ లో డబ్బులు పెట్టుకోవడం మర్చిపోయినట్లున్నాను." ఖాళీ పర్స్ చూపిస్తూ బిడియంగా అన్నాడు ఆనంద్.

"అయ్యో ఇప్పుడెలా?" కంగారు పడింది సుమతి.

"ఏముంది, హోటల్ వాడికి చెప్పి పప్పు రుబ్బటమే. నాకైతే రుబ్బటం రాదు. మీరు రుబ్బుతుంటే కావాలంటే పక్కనుంచి

తోయగలను. ముందే చూసుకోవాల్సింది. వుందనుకున్నాను. సరీ..." దీనంగా అన్నాడు ఆనంద్.

"వుండండి, నాదగ్గర వున్నాయేమో చూస్తాను. " అని పుస్తకాల బాగ్ లో నుంచి పుస్తకాలన్నీ తిరగేసింది. అక్కడక్కడ చిల్లరతో ఐదు రూపాయలు దొరికాయి.

"అమ్మయ్య ఐదు రూపాయలు దొరికాయి. బిల్ పే చేసేయండి.."నిట్టూరుస్తూ ఆ డబ్బు ఆనంద్ కు ఇచ్చింది సుమతి. ఇద్దరూ హోటల్ బయటకు వచ్చి బస్టాండ్ వైపు నడిచారు.

"సారీ వదిన గారూ మీరు చాలా నీరసంగా వుంటే భోజనం చేద్దామని పిలిచాను. ఆ తొందరలో పర్స్ లో డబ్బులు వున్నాయో లేవో చూసుకోలేదు. ఇప్పుడు బస్ లో ఏం వెళతారు రండి నా స్కూటర్ మీద దింపేస్తాను."

వద్దులెండి. మధ్యలో పెట్రోల్ ఐపోతే స్కూటర్ నాతో తోయిస్తారు. " నవ్వుతూ అంది సుమతి.

"అయ్యో లేదండీ పోనీలెండి బస్ టికెట్ కు డబ్బులు వున్నాయా?" అడిగాడు ఆనంద్. వున్నవన్నీ వూడ్చి హోటల్ లో ఇచ్చేసింది. ఏం చెప్పాలో తెలీలేదు సుమతికి.

"ఒక్క నిమిషం.."అని పక్కకు వెళ్ళి అక్కడున్న స్నేహితుని అడిగి ఒక్కరూపాయి తెచ్చి ఇచ్చాడు ఆనంద్.

అమ్మయ్య అనుకొని ఆనంద్ కు బై చెప్పి అప్పుడే వచ్చిన బస్ ఎక్కింది సుమతి.లోపలికి వచ్చిన సుమతితో " సుమా అన్నం తిందువుగాని రా " పిలిచింది సరస్వతి.

"వద్దమ్మా, నేను మా లక్ష్మణస్వామితో తిన్నాను. " జావాబిచ్చింది సుమతి.

"లక్ష్మణస్వామా? అతనెవరు?" కొంత గాభరాగా అడిగింది.

"అబ్బ, అంత కంగారెందుకమ్మా? నా కాబోయే మరిది గారు, ఆనంద్..."

"అతనెక్కడ కలిసాడు? " ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"వాళ్ళ కాలేజి పక్కనే కదా, అప్పుడప్పుడు బస్ స్టాప్ లో కలుస్తుంటాడు. ఈరోజు లాబ్ లో కాస్త పనెక్కువై, బాగా ఆకలేసి నీరసం వచ్చింది. నీరసంగా బస్టాప్ లో బస్ కోసం వెయిట్ చేస్తూంటే వచ్చాడు. నాకు నీరసంగా వుందని పక్కన వున్న హోటల్ కు తీసుకెళ్ళాడు. ఇద్దరం లంచ్ చేసాము.చాలా, ఇంకా వివరంగా చెప్పాలా?" విసుగ్గా అంది సుమతి.

ఊఁ..బాగానే ఉందికానీ ఆ అబ్బాయితోనైనా పెళ్ళికి ముందు అంతగా కలవకు, బాగుండదు" అంటూ ఇంకా ఏమో చెప్పబోయింది సరస్వతి.

"అబ్బా, సోది ఆపమ్మా" అంటూ సుమతి వినిపించుకోకుండా లోపలికి వెళ్ళిపోయింది.

నలభై సంవత్సరాల తర్వాత హోటల్లో డిన్నర్ తింటూ గులాబ్ జామూన్ నోట్లో పెట్టుకోబోతున్న సుమతికి తన పెళ్ళి కాకముందు మరిది తనని జోక్ చేసిన విషయం గుర్తొచ్చి నవ్వుకుంది.

"ఏంటక్కా మీలో మీరే నవ్వుకుంటున్నారు?"

అరుణ ప్రశ్నకి ఉలిక్కిపడి ఆలోచనలనుంచి తేరుకొని " నలభై ఏళ్ళ క్రితం మీ ఆయన చేసిన నిర్వాకం గుర్తొచ్చి " నవ్వింది సుమతి.

"ఏమి చేసారు?" ఆసక్తిగా ప్రశ్నించింది అరుణ.

ఆరోజు సంగతి చెప్పి " అమ్మో, నాదగ్గర ఎలాగో డబ్బులు వుండబట్టి కాని, లేకపోతే నాతో పప్పు రుబ్బించేవాడు..." అంది సుమతి.

"మీరు మరీనూ వదినగారూ, మీరు రుబ్బుతుంటే నేను పక్కనుంచి తోస్తానని చెప్పను కదా" అమాయకంగా అన్నాడు ఆనంద్.

"నీ మొహం..వాడి దగ్గర డబ్బులు లేకపోవటమేమిటి? నా దగ్గర, నాన్న దగ్గర ఒకళ్ళకొకళ్ళకి తెలికుండా పడుతుండేవాడు. బస్ కోసం ఇచ్చినవి కూడా వాడివే అయివుంటాయి. ఏరా ఆనంద్....నిజం చెప్పు.ఆరోజు నీదగ్గర డబ్బులు లేవా?" దబాయించాడు అర్జున్.

"అన్నయ్యా! ఏదో కాబోయే వదినగారు కదా అని కాస్త జోక్ చేశాను. అంతే!" దబాయించాడు అర్జున్.

"హమ్మో! ఎంత ఖతర్నాక్! మీ పుట్టినరోజని పార్టీ ఇస్తానని ఈ ఫైవ్ స్టార్ హోటల్ కు తీసుకొచ్చారు. ఈరోజైనా మీరు బిల్ కడతారా, నాతో కట్టిస్తారా?" ఉక్రోషంగా అడిగింది సుమతి.

"ఇన్నేళ్లైనా వదినగారికి ఉక్రోషం తగ్గలేదు " నవ్వుతూ వెయిటర్ తెచ్చిన బిల్ తీసుకుంటూ వదినగారిని ఉడికించాడు ఆనంద్.

"పదమ్మా అరుణా! మనం పోదాం... ఈ వదినా, మరిదీ బిల్ కడతారో, పప్పు రుబ్బుతారో!" లేచాడు అర్జున్.




శ్రీపురంలో ఉండే కిట్టయ్య ఒక షరాబు. ఊర్లో వారివే కాకుండా చుట్టుప్రక్కల పల్లె ప్రజలవి బంగారు నగలు చేసేవాడు. తీరిక సమయాల్లో పుస్తకాలు, తాళపత్ర గ్రంధాలు చదువుతూ కొత్తకొత్త భాషలు నేర్చుకునేవాడు.

అతడి ప్రక్క ఇంట్లో వీరేశం అనే రైతు ఉండేవాడు. ఇద్దరూ చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. వీరేశం మాత్రం పొలం పని లేనప్పుడు మిత్రులతో కలసి జూదం ఆడేవాడు. అతడు కిట్టయ్యని కూడా ఆటకి రమ్మని పిలిచేవాడు కానీ కిట్టయ్య వెళ్ళలేదు. దాంతో అతడిని మిత్రులతో కలసి ఎగతాళి చేసేవాడు. 'పెద్ద పండితుడిలాగా ఎప్పుడూ చదువెందుకు? ఎవరికైనా పాఠాలు చెప్పాలా? కావ్యాలు రాయాలా? షరాబుకి తూనికల లెక్కలు వస్తే చాలదా?" అని.

కిట్టయ్య అదేమి పట్టించుకోకుండా "ఇందులో ఉండే ఆనందం, ప్రయోజనం అనుభవిస్తే కాని తెలియదు" అనేవాడు.

కొన్నాళ్ళ తరువాత కిట్టయ్యకు నగరం వెళ్ళే పని పడింది. ఒక భాగ్యవంతుడి కుమార్తెకు మంచి సంబంధం కుదరడమే కాకుండా పది రోజులలోనే వివాహ ముహూర్తం నిశ్చయించడంతో జరూరుగా నగలు చెయ్యాల్సి వచ్చింది. అక్కడున్న షరాబులందరిదీ అదే పరిస్థితి కావడం వల్ల నిపుణులైన పనివాళ్ళ కోసం వెతికారు. పట్టణంలోని వర్తకుల ద్వారా కిట్టయ్య పేరు తెలుసుకుని

అతడికి  కబురు పంపించారు.

నగరంలోనే అతడికి వసతి, భోజన సదుపాయం కలిగిస్తారని తెలియడంతో వచ్చిన అవకాశానికి సంతోషించి కిట్టయ్య బయల్దేరాడు. పొరుగింటి వీరేశం కూడా నగరం చూడడానికి వస్తానన్నాడు కిట్టయ్యతో. ఇద్దరూ కలసి వెళ్ళారు.

పగలంతా నగల తయారీలో సహకరించేవాడు కిట్టయ్య. సాయంత్రాలలో వీరేశాన్ని తీసుకుని వూరు చూసేవాడు. నగరంలో సందర్శనకు ఎంపిక చేసిన ప్రదేశాలు, ఉద్యానవనాలు, దేవాలయాలు చూసారు.

అక్కడ ఉన్న రోజుల్లో కాళికామాత ఉత్సవం జరిగింది. ఒక సాయంత్రం పూట మిత్రుడితో కలసి ఉత్సవానికి వెళ్ళాడు కిట్టయ్య. అక్కడ అయిదేళ్ళ వయసున్న బాలిక తల్లిదండ్రుల నుండి తప్పిపోయింది. పొరుగు రాజ్యం నుండి బంధువుల ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు, కూతురు కోసం ఏడుస్తూ వెతకడం మొదలుపెట్టారు.  వారి భాష అక్కడి వారికి  తెలియక సహకారం అందలేదు.

వాళ్ళ మాటలు కిట్టయ్య విన్నాడు. బాలిక తప్పిపోయిన సంగతి గ్రహించి దగ్గరలో ఉన్న కొత్వాలుకి చెప్పాడు. కొందరు భటులను రప్పించి తప్పిపోయిన బాలిక వివరాలు తెలుసుకుని వెతకమన్నాడు కొత్వాలు.  బాలిక ఆనవాళ్ళు తెలుపుతూ ఆ ప్రాంతంలో దండోరా కూడా వేయించడంతో కొంత సేపటికి  బాలిక దొరికింది. ఆమెను తల్లిదండ్రులకు అప్పగించాడు కొత్వాలు.

తమ మధ్య దుబాసిగా కిట్టయ్య వ్యవహరించక పోతే సులువుగా బాలిక దొరికేది కాదని,  బాలికను అప్పగించి పొరుగు దేశపు ప్రజల మనసుల్లో తమ ప్రతిష్ట నిలబెట్టాడని అతడిని  మెచ్చుకున్నాడు కొత్వాలు. వీరేశం అదంతా గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు.

నగల తయారీ పని పూర్తయిన తరువాత ఇద్దరూ కలసి తిరుగు ప్రయాణమయ్యారు. అడవి మార్గం దాటుతుండగా వారికి ఆకలి, దాహం కలిగాయి.  దూరంగా వారికి ఒక గూడెం కనిపించింది. అక్కడ కొండజాతి మనుషులు ఉన్నారు. అక్కడున్న వారికి సభ్య ప్రపంచం మాట్లాడే భాష తెలియదు. వారి భాష కిట్టయ్యకు తెలియడంవల్ల  వాళ్ళ భాషలో పలకరించి మాట్లాడాడు కిట్టయ్య. అతడినీ, వీరేశాన్నీ  ఆప్యాయంగా పలకరించి దాహం తీర్చి తినేందుకు తియ్యటి పండ్లు పెట్టారు వాళ్ళు.

ఆ సమయంలో పట్టణం నుండి ఒక వ్యాపారి అక్కడకి  వచ్చాడు. రంగురాళ్లు  కొనడానికి వచ్చానని చెప్పాడు. కొందరు

తమ వద్ద ఉన్న రంగురాళ్ళను చూపించారు. ఆ వ్యాపారి చౌకగా బేరమాడి, జేబులో నుండి ధనం తీసి వారికి ఇవ్వబోయాడు. అక్కడే ఉన్న కిట్టయ్య రంగురాళ్ళలో ఒకదానిని చేతిలోకి తీసుకుని పరీక్షించాడు. కిట్టయ్యకి ఆశ్చర్యం వేసింది. అదొక విలువైన వజ్రం.

“అవి మామూలు రంగురాళ్ళు కాదు. విలువైన వజ్రాలు. ఆ వ్యాపారికి చౌకగా అమ్మవద్దు” అని వాళ్లకి చెప్పాడు కిట్టయ్య. అతడి వైపు వింతగా చూసి ‘నీ మాటలు ఎలా నమ్మాలి?’ అని అడిగాడు నాయకుడు. అప్పుడు కిట్టయ్య “నగరంలోని వజ్రాల దుకాణంలో వీటిని అమ్మకానికి పెడదాము. ఎంత ధనం వస్తుందో మీరు చూడండి. మీరు వస్తానంటే అమ్మించి మంచి ధర ఇప్పించడంలో సాయం చేస్తాను” అన్నాడు.

కిట్టయ్య చెప్పినట్టు నాయకుడు తన వాళ్ళని తీసుకుని బయల్దేరాడు. నగరంలోని వజ్రాల వ్యాపారులు పరీక్షలు జరిపి అవి నిజమైన వజ్రాలని తేల్చారు. పెద్ద మొత్తంలో ధనం ఇచ్చి వాటిని కొన్నారు. నాయకుడి ఆనందానికి అంతు లేకపోయింది. ”ఇంతకాలం మామూలు రంగురాళ్లు అనుకుని ఎన్నో అమ్మేసాము. నీ వల్ల నిజం తెలిసింది” అంటూ కిట్టయ్య చేసిన సాయానికి ప్రతిఫలంగా ఒక వజ్రం అమ్మగా వచ్చిన ధనాన్ని అతడికి కానుక ఇచ్చాడు.

మిత్రుడితో కలసి వూరు చేరుకున్నాడు కిట్టయ్య. తనకి అందిన ధనంలో కొంత భాగం మిత్రుడికి ఇవ్వడమే కాకుండా మరికొంత ధనం వెచ్చించి తమ పల్లెను అభివృద్ధి చేసాడు కిట్టయ్య.

వీరేశం ద్వారా కిట్టయ్య భాషా ప్రతిభ తెలుసుకున్న జనం అతడిని మనస్ఫూర్తిగా అభినందించారు. అంతేకాకుండా కొత్వాలు ద్వారా రాజుగారికి కూడా కిట్టయ్య పేరు చేరింది. ఒక మంచి రోజున అతడిని సన్మానించాడు మహారాజు. ఆ విధంగా కిట్టయ్య గొప్పతనం రాజ్యమంతా ప్రాకిపోయింది. అప్పటి నుంచి ఆ వూరిలో పిల్లలు, పెద్దలు తీరిక సమయాల్లో పుస్తకాలు చదువుతూ జ్ఞానం పెంచుకోవడానికి వెచ్చించారు.




"కదూ! అలాంటప్పుడు బుద్ధిగా చదువుకోక ఇలాంటి ముసుగులతో వయసు వేడిలో; క్షణికావేషాలతో; పబ్లిక్ లోనే ముద్దులతో; కౌగిలింతలతో;రొమాన్స్ లతో సినిమా చూపిస్తే వారి గుండెలు బద్దలు కావూ? పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతుందనుకుంటే ... పొరబాటు ఎవరిది?" ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు రాంబాబు.

"మన సంస్కృతి ఎంత గొప్పది. మన కుటుంబ వ్యవస్థ ఎంత గొప్పది. మన వారసత్యం ఎంత గొప్పది. ఎంత గొప్ప ఖర్మ భూమి మనది. ఎంత గొప్పవి మన సంప్రదాయాలు. పాశ్చాత్యులు సైతం మన వైపు చూస్తున్నారు. మన సంస్కృతి; కుటుంబ వ్యవస్థ గొప్పదని గుర్తించారు. కానీ మనమే ... మన యువత పాశ్చాత్య వ్యామోహంలో పడి కొట్టుకుపోవడం నాకు సుతరామూ ఇష్టం లేదు. “ ఆయాసంతో రొప్పసాగేడు రాంబాబు.

"కూల్ డౌన్ రాంబాబూ! మనం అవేశపడడంలో అర్ధం లేదు. యువత అర్ధం చేసుకోవాలి."

"ఇంకెపుడు అర్ధం చేసుకుంటారూ?" ఆయాసంతో దగ్గుతూ అన్నాడు.

ఇంతలో ఎదురు బెంచి ముసుగు అమ్మాయి దగ్గరికి వచ్చి నీళ్ళ బాటిల్ అందిస్తూ "నీళ్ళు తాగండి తాత గారు!" అంది.

నీళ్ళు తాగి కుదుటపడ్డాడు రాంబాబు.

అప్పుడంది ఆ అమ్మాయి నింపాదిగా - " మీ మాటలు విన్నాను తాత గారూ! మీ ఆవేశం అర్థమయింది. నిజమే మీరన్నట్టు కొంత మంది యువత పెడదార్లు పడుతున్న తీరు అభ్యంతరకరమే. కాని అందరూ అలా ఉండరు. మీరనుకున్నట్టు ముసుగు మనుషులంతా కాని పని చేస్తున్నట్లు; ముసుగు చాటులో మన సంస్కృతిని మంట గలుపుతున్నట్లు మీరు అవేశ పడడం చూస్తే అందర్నీ ఒకే గాటిలో కట్టినట్లవుతుంది. ముసుగుకు ఎవరి కారణాలు వారికుంటాయి."

"కాని పనులు చేసేవారే ముసుగేస్తారు అమ్మాయీ! మంచి పని చేసేవారికి ముసుగుతో పనేమిటి? రాంబాబు కూడా గట్టిగానే బదులిచ్చాడు. మళ్ళీ తనే అన్నాడు - "నువ్వు ముసుగులో ఉన్నావు! దాని వెనకాల ఏ బృహత్తర మహాత్కారణం ఉందో తెలుసుకోవచ్చా?" అతని మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది."ఉంది. విని తట్టుకునే ధైర్యం ఉంటే...?"

ఆమె క్షణంలో ముసుగు విప్పేసింది. ఆమెను చూసి ఒక్కసారిగా మాకు ఒళ్ళు జలదరించింది. ముఖమంతా కాలిపోయి , కమిలిపోయి వికృతంగా; ముడుతలు ముడుతలుగా ఉంది. ఏదో ఘోర విపత్తు నుంచి బయట పడ్డట్టు చాల అసహ్యంగా ఉంది. చూడడానికే జుగుప్సగా ఉంది.

మళ్ళీ ముసుగు బిగించుకుంది అమ్మాయి. కళ్ళనుంచి జలజలా రాలుతున్న కన్నీటిని బలవంతంగా ఆపి; తనను తాను కంట్రోల్ చేసుకునే ప్రయత్నం చేస్తుంది.

"ఏమయింది అమ్మాయీ!" కంగారును అణుచుకోలేక అడిగాను.

"పార్కుల్లోకి అందరూ అనందంగా గడపడానికి వస్తారు. చల్ల గాలికి సేదదీరడానికి వస్తారు. ఆహ్లాదంగా గడపడానికి వస్తారు. ఈ పూల సౌరభాలు; పక్షుల కిలకిలా రావాలు; అందమైన సాయంత్రాల్ని ఆస్వాదించడానికి వస్తారు. అలాంటప్పుడు ఇలాంటి వికృత రూపంతో మీలాంటి వారి ఆనందాల్ని దూరం చేయడం ఇష్టం లేక ఇలా ఉంటున్నాను. అంతే కాని ముసుగు నాకేం ఆనందం కాదు." ఆగింది.

"ఇంతకీ ముఖానికి ఏమయింది" ఆతృత నణుచుకోలేక అడిగాను.

"తనను ప్రేమించ లేదని ఓ ఉన్మాది ఆసిడ్ దాడి చేశాడు. మృత్యువుతో పోరాడి బయటపడ్డాను."

నాణేనికి రెండో వైపు మమ్మల్ని కలచి వేసింది. మరింత ఆందోళనకు గురిచేసింది. ఇంత వరకు చూసిన దృశ్యాలు ఒక వైపయితే; ఇది రెండో వైపు. విచ్చలవిడితనం ఒక ప్రక్క; దానికి బలి అయిన అభాగ్యుల జీవితాలు మరో ప్రక్క - నాణేనికి బొమ్మా; బొరుసులా.

"మీ మాటలు నన్ను బాధించాయి. ఇప్పుడే చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్నాను. నాలాగే ఎంతో మంది ఆడపిల్లలు ముసుగుల చాటున చెప్పుకోలేని శిక్షలననుభవిస్తున్నారు. కాలుష్యం నుంచి; ప్రేమ పేరుతో వెంటబడే ఉన్మాదుల నుంచి; మృగాల నుంచి; బెదిరింపుల నుంచి; అనుక్షణం వెంటాడే ఆకలి చూపుల్నుంచి తమను తాము రక్షించుకోవడానికి ముసుగుల వెనక దాక్కుంటున్నారు. ఇష్టంగా కాదు ... అలా నిర్దాక్షణ్యంగా నెట్టేస్తున్నారు. దయచేసి మీకు మనసుంటే ఆ ముసుగు చాటు మనుషుల్ని కాదు మనసుల్ని అర్థం చేసుకోండి. ముసుగు లేని ప్రపంచాన్ని నిర్మించడానికి ప్రయత్నించండి." నీళ్ళ బాటిల్ తీసుకుని కన్నీళ్ళు తుడుచుకుంటూ ఆమె వెళ్ళిపోయింది.

ఆమె మూగ వేదన మాకర్థమయింది. పాపం! ...చేయని నేరానికి శిక్ష అనుభవిస్తోంది....అదీ జీవితాంతం. భూమిపై ఆడదానిగా పుట్టడమే నేరమా? లేక శాపమా? దీనికి విముక్తి లేదా? కనీసం ఈమె జీవితం ఇతరులకు గుణపాఠం అయితే ఎంత బాగుంటుంది- ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాం.




గాలతోనూ..గ్రానీ గ్రానీ ..అంటూ అల్లుకు పోయే గ్రాండ్ చిల్డ్రన్స్ అల్లరి తోనూ..నాన్నకు భయపడి అమ్మనే అతుక్కు పోయిన పుత్ర రత్నాలు ఒలక బోసిన ప్రేమ ప్రవాహం లోనూ అనందంగా అ వారం రోజులూ గడిపేసింది తెలుగు తల్లి. నాన్నగారి రిటైర్మెంటుకు..రజని మ్యారేజ్ కూ ఎందుకు రాలేక పోయామో అంటూ వాళ్లు చెప్పిన కధలన్నీ నమ్మేసి ..భర్తను కన్విన్స్ చేయడానికి శాయ శక్తులా ప్రయత్నించి..విఫలురాలై చిన్నబోయింది. ప్రతిరోజూ మధ్యాహ్నం భోంచేసి ఫ్రెండ్స్ ను కలవాలని వెళ్లి పోతున్న రాంబాబు..శ్యాంబాబుల ప్రవర్తనను గమనిస్తూ..తనలో తాను నవ్వుకుంటూ ..కేవలం గ్రాండ్ చిల్డ్రన్స్ తో మాత్రమే మూవయ్యే వారు ధరణీ రావు గారు.

********

తమ విశాలమైన రెండు బెడ్ రూములూ కొడుకులకిచ్చేసి ప్రసన్న దంపతులు హాల్లో బెడ్ ల మీద సర్దుకునేవారు.

అర్ధరాత్రి భర్త తట్టి లేపితే లేచి నిద్ర ముఖంతో ఏంటన్నట్లు చూసిన భార్యను మాట్లాడ వద్దన్నట్లు సైగ చేసి పెద్ద కుమారుడి గదిలో నుంచి వస్తున్న మాటలు వినమని లో గొంతుతో చెప్పారు ధరణీ రావు గారు.

అమ్మా నాన్నలు నిద్ర పోయారని కన్ ఫం చేసుకున్నాకే మీటింగ్ పెట్టుకున్న ఆ నలుగురూ లో పిచ్ లో మాట్లాడుకుంటున్నారు.

“అన్నయ్యా..! నిన్ను నీ ఫ్రెండింట్లో డ్రాప్ చేసి   సాయంత్రం నా ఫ్రెండును కలిశాను.వాడు రియలెస్టేట్ జీనియస్ ..వాడు రిజిస్ట్రేషన్ అఫీసుకు తీసు కెళ్లాడు. ఈ మధ్యే మన పొలాల ప్రక్క ల్యాండు ఎకరా సిక్స్   సిఆర్ కు అమ్మారంట..మీడియేటర్స్ కూడా కన్ఫం చేశారు. మనది అయిదెకరాలు..దట్ కమ్స్ థర్టీ సి ఆర్..మన హౌస్ లాండ్ థౌజెండ్ స్క్వేర్ యార్డ్స్ ..ఇక్కడ యార్డ్ మినిమం లాక్ రూపీ కాస్టట..అంటే మరో టెన్ సిఆర్..ఇట్ కంస్ ఫార్టీ..మనం అమెరికాలో కడుపు కట్టుకుని కూడా యింత సంపాదించలేం..ఇండియా వచ్చెళితే లక్షల్లో ఖర్చవుతుందని అప్పుడు   అబద్ధాలు చెప్పి పొరపాటు చేశాం..అమ్మ నమ్మింది గానీ డాడీ నమ్మలేదు. ఆయన్ని మనం కన్విన్స్ చేయలేం..అందుకే అమ్మ సైడ్ నుండి నరుక్కు రావాలి..ఆ బాధ్యత మా వదిన గారు..మీ మరదలు చూసుకుంటారు..అమ్మని ఐస్ చేస్తే చాలు..డాడీని అమ్మే మేనేజ్ చేసి ఒప్పిస్తే..ఆస్థులన్నీ అమ్మేసి అందరం కలసి ఫ్లైటెక్కేద్దాం..ఎట్లాగూ వన్నియర్లో అమ్మానాన్న ఇండియా ఫ్లైటెక్కేస్తారు..అప్పుడు నువ్వో నేనో వచ్చి ఓ ఫ్లాటు కొని..యిచ్చేద్దాం..వాడ్డూయుసే.”?

ఒక్కసారిగా నవ్వులు.. ప్రసూనాంబ షాకైపోయి   భర్తను బేలగా చూసింది. అప్పటికే కళ్లు కాసారాలైపోయాయి. కళ్లు తుడిచి..టేకిట్ ఈజీ అన్నట్లు భుజంతట్టి..సముదాయించారు..

********

లాయర్ కృష్ణమూర్తి తో బాటు ధరణీ రావు గారి కుటుంబ సభ్యులందరూ హాల్లో సమావేశమయ్యారు.

పిల్లలంతా బయట ఆటల్లో మునిగి పోయారు.

“లాయర్ గారూ ..! వీళ్లంతా నా కుటుంబ సభ్యులు..వారం క్రిందటే   పదేళ్ల తర్వాత స్టేట్స్ నుంచి వచ్చారు ..మళ్లీ ఎప్పుడొస్తారో నాకే కాదు..వాళ్లకే తెలియదు. ప్రశాంతంగా వుండిన మనూరు.. రాజధానిగా   మారబోతుందన్న వార్తతో కబ్జాలతో కత్తి పోట్లతో కునుకు లేకుండా చేస్తోంది. ఎప్పటి నుంచో ఆస్థి పంపకాలు చేయాలను కున్నాను. అనుకోకుండా వీళ్లందరూ వచ్చేశారు..ఇదే కరెక్ట్ టైమనుకుంటున్నాను..నా ఆస్థి ఈ ఇంటితో బాటు అయిదెకరాల పొలం..నా స్వార్జితం..నా యిష్ట ప్రకారం చేయొచ్చా..లేక వీళ్ల   పర్మిషన్స్.. సంతకాలలాంటివేమన్నా..”?

“నో ..నాటటాల్ రిక్వైర్డ్..ఎంటైర్ థింగీజ్ యువర్స్ యుకెన్ డూ యాజ్ యూ ప్లీజ్..”

లాయరు గారు కన్ఫం చేశాక మళ్లీ తన మాటలు కొనసాగించారు..ధరణీ రావు గారు.

ఒక్క ప్రసూనాంబ ముఖంలో తప్ప .. మిగిలిన అందరి ముఖల్లోనూ..టెన్షనే టెన్షన్ ..ఆంధ్రప్రదేశ్ ఎండల్లా.

“దాదాపు యిరవై సంవత్సరాల బాటు పొలం దున్ని..పంటలు పండించి..కరువు సమయంలో కూడా కౌలు కట్టిన నా కౌలు దారు..కోటయ్యకు రెండెకరాలు రాయండి..మా యింటి ఆడపడుచు మా కుమార్తె రజని పేరున ఒక ఎకరం..లాభాపేక్షలేకుండా అనాధ పిల్లలకోసం .వృద్ధులకోసం..ఆశ్రమం నడుపుతున్న రామకృష్ణా మిషన్ వారికో ఎకరం రాయండి. మిగిలింది నా భార్య పేరున రాయండి..ఈ యిల్లు కూడా నా తదనంతరం..సర్వ హక్కులతో తనకే చెందేలా వీలూనామాలో ఎప్పుడో రాసేశాను..ఇక ఈ సంతాన పురుషులు అనవసరంగా మాతృదేశానికొస్తే లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని సెలవులు దొరకవని అబద్దాలు చెప్పుకుంటూ అమెరికాలో ఆల్రెడీ కోట్లు కూడబెట్టేశారు.. ఒకవేళ వాళ్లకేమైనా యిద్దామనుకున్నా డర్టీ ఇండియా..డర్టీ ఇండియన్ మనీ అనేస్తారని భయపడి నేనా సాహసం చేయ లేక పోయాను..బికాజ్ ఐ లవ్ మై భారత్..ఐ లవ్ మై అమరావతి ..అండ్ ఐ లవ్ మై పీపుల్ ఉద్విగ్నులైపోయి..మాటలు రాక మౌనమూర్తయి పోయారు..మాజీ ప్రధాన అధ్యాపకులు..ధరణీ రావు గారు